TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 117 | హైదరాబాద్ | ఆదివారం 18-10-2026 | పేజీలు: 08

## బీజేపీలో 25 మందికి షాక్?

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ కసరత్తు
- రెండు ఎమ్మెల్సీ స్థానాలపై కమలదళం గురి
- అభ్యర్థుల ఎంపికపై బీజేపీలో తీవ్ర ఉత్కంఠ
- ఆశావహుల్లో నిరాశ.. అసలు కారణమేంటి?
- బలమైన అభ్యర్థుల కోసం బీజేపీ అన్వేషణ
- అభిప్రాయ సేకరణ పూర్తి.. అధిష్టానానికి పేర్లు
- 60కి పైగా అసెంబ్లీ నియోజకవర్గాలపై బీజేపీ ఫోకస్
- గ్రాడ్యుయేట్ ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యూహాలు

2



## మూడో కూటమి దిశగా డీఎంకే అడుగులు!

- 'సర్'పై నిరసనల వేళ స్టాలిన్ కీలక భేటీ
- ఎంపీల సమావేశంలో భవిష్యత్తు రాజకీయ కార్యాచరణపై చర్చ
- ఇండియా కూటమికి ప్రత్యామ్నాయంగా మరో కూటమి ఏర్పాటుపై కసరత్తు

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో డీఎంకే కీలక సమావేశానికి సిద్ధమైంది. ఆ పార్టీ అధినేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన శనివారం చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎంపీలు సమావేశం కానున్నారు. 'సర్', నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు భవిష్యత్తు రాజకీయ కార్యాచరణపై ఇందులో చర్చించనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి మిగతా 2లో..



## విద్యుత్, నీటిని పొదుపుగా వాడండి

- ఎల్ నినో ప్రభావంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన
- విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి
- రాష్ట్రంలో 20,000 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- గతంలో చలిగా ఉండే అక్టోబర్‌లోనూ ఇప్పుడు ఎండల తీవ్రత
- వాతావరణ మార్పుల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న భట్టి

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):
రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు.
శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు.
గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మిగతా 2లో..

## గోదావరి-కావేరి లింక్‌పై కుట్ర జరుగుతోంది..

- గోదావరి–కావేరి లింక్ పేరుతో జలాల దోపిడీకి కుట్ర
- చంద్రబాబు లేఖ రాయగానే కేంద్రం సమావేశం ఏర్పాటు
- గోదావరి జలాలను కబళించే ప్రయత్నం: హరీశ్‌రావు
- రేవంత్‌రెడ్డికి గురుదక్షిణగా గోదావరి జలాలను వదిలేస్తున్నారా?
- తెలంగాణ నీటి హక్కులను శాశ్వతంగా దెబ్బతీస్తున్నారు
- బీఆర్ఎస్ పోరాటంతోనే ప్రభుత్వ నేతల్లో కదలిక
- దేవాదుల నీటిని వదిలేస్తే చంద్రబాబు ఒడిసిపట్టారు
- నీటి విషయంలో రేవంత్‌ను ప్రజలు క్షమించరు



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):
నవంబర్ 3న ఎన్‌బీడీఏ సమావేశం జరగబోతుందని ఎజెండా కూడా విడుదల అయింది. గోదావరి కావేరి లింక్‌ను ఈ ఎజెండాలో చేర్చుతూ అన్ని రాష్ట్రాలకు పంపించారు. ఈ విషయంలో కుట్ర జరుగుతుందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 7వ తారీఖున చంద్రబాబు నాయుడు లేఖ రాశారని.. వారంలో ఎజెండాలో చేర్చుతూ అన్ని రాష్ట్రాలకు ఇన్ఫర్మేషన్ వచ్చిందన్నారు. చంద్రబాబు లేఖ రాయగానే కేంద్రం మీటింగ్ ఏర్పాటు చేసింది. గోదావరిని చంద్రబాబు నాయుడు కబళిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ లేవనెత్తే వరకు మన రాష్ట్ర నేతలకు సోయి లేదని మండిపడ్డారు. గతంలో చంద్రబాబు ప్లాన్‌లను అడ్డుకున్నామని, ఇప్పుడు గోదావరి కావేరి లింక్ పేరుతో గోదావరి జలాల్ని కబళించే కుట్ర చేస్తున్నారన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ పదేపదే చెప్పేవారు. ఆయన చెప్పినట్లే ఇప్పుడు జరుగుతుంది. రేవంత్ రెడ్డి గురుదక్షణ అనుకొని వదిలి పెడుతున్నాడా? అంటూ నిలదీశారు. రేవంత్‌ను ప్రజలు తరతరాల వరకు క్షమించరన్నారు. హక్కులు ఉన్నప్పుడే గోదావరి కృష్ణా జలాలను మిగతా 2లో..



2

## రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం.. 8 మంది మృతి

- రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. 8 మంది మృతి
- కాలువలో పడిన మినీ బస్సు.. 17 మందికి గాయాలు
- ఢిల్లీ–ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై దుర్ఘటన
- ఖాటూ శ్యామ్ ఆలయానికి వెళ్తుండగా ప్రమాదం
- 15 అడుగుల లోతున్న కాలువలోకి దూసుకెళ్లిన బస్సు
- మధ్యప్రదేశ్ కుటుంబంలో తీవ్ర విషాదం

రాజస్థాన్, (ప్రజాక్షేత్రం):
రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కోటా జిల్లాలో ఢిల్లీముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణిస్తున్న మినీ బస్సు అదుపుతప్పి లోతైన కాలువలో పడిపోయింది. శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందగా, మరో 17 మంది గాయపడ్డారు.

**మధ్యప్రదేశ్ కుటుంబానికి చెందిన వారు**

ప్రమాదానికి గురైన బస్సులో మధ్యప్రదేశ్‌కు చెందిన మిగతా 2లో..

## పిల్లలకూ ఇంటర్నెట్ వినియోగ హక్కు ఉంది

- ఆన్‌లైన్ భద్రత పేరుతో పూర్తిగా దూరం చేయడం సరికాదు
- భావప్రకటన స్వేచ్ఛలో ఇంటర్నెట్ వినియోగం భాగమే
- సోషల్ మీడియాలో ప్రత్యేక 'చైల్డ్ మోడ్'పై సుప్రీంకోర్టు సూచన



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):
ఇంటర్నెట్ వినియోగం ప్రతి వ్యక్తి ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పిల్లలకు కూడా వయసుతో సంబంధం లేకుండా ఈ హక్కు ఉంటుందని పేర్కొంది. ఆన్‌లైన్ భద్రత పేరుతో పిల్లలను పూర్తిగా ఇంటర్నెట్‌కు దూరం చేయడం సరైన పరిష్కారం కాదని అభిప్రాయపడింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో మిగతా 2లో..

## సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించండి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పిలుపు
- నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- ఇప్పటివరకు 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడి
- త్వరలో మరిన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు
- రిటైర్డ్ ఉద్యోగులకు రూ.9 వేల కోట్ల బకాయిల చెల్లింపు
- ప్రభుత్వ పథకాలను పట్టభద్రులకు వివరించాలని సూచన
- ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో కాంగ్రెస్ నేతలకు దిశానిర్దేశం




హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):
ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మిగతా 2లో..



## వరంగల్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం

- త్వరలోనే వరంగల్ ఎయిర్‌పోర్టు ప్రారంభం
- హనుమకొండలో ఐటీ టవర్ ఏర్పాటు చేస్తాం
- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):
వరంగల్ నగరాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా వరంగల్ నిలుస్తోందన్నారు. త్వరలోనే వరంగల్ ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తామని వెల్లడించారు. హనుమకొండలో ఐటీ టవర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంచడం, ఫిట్‌నెస్, క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించడమే లక్ష్యంగా నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ 10కే రన్‌లో మంత్రి పాల్గొన్నారు. ఎన్ఐటీ నుంచి హయగ్రీవాచారి మైదానం వరకు మారథాన్ కొనసాగింది. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 5కే, 10కే, 21కే రన్‌లు నిర్వహించడం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజుతో పాటు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ పాల్గొన్నారు.

## తెలంగాణలో తీవ్ర కరవు, 315 మండలాల్లో కరవు ఛాయలు

- రాష్ట్రంలో 315 మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నట్టు గుర్తింపు
- కేంద్రం తక్షణమే సాయం చేయాలని కోరిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రాష్ట్రవ్యాప్తంగా 23 శాతం వర్షపాత లోటు, 13 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు
- పంట నష్టపోయిన రైతులకు రూ.1,986 కోట్ల సహాయ ప్యాకేజీ ప్రతిపాదన
- ప్రమాదకరంగా పడిపోయిన జలాశయాల నీటిమట్టాలు



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):
తెలంగాణలో కరవు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా తగ్గడంతో 315 మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని తక్షణమే ఆదుకోవాలని, సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్), మధ్యంతర పంట విత్తనాల పంపిణీకి అవసరమైన ఆర్థిక సాయం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.
కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వ్యవసాయ సంక్షోభాన్ని ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. మద్దతు ధరతో మొక్కజొన్న, జొన్న తదితర పంటలను 100 శాతం కొనుగోలు చేయాలని, ధరల మద్దతు పథకం కింద ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. రసాయన ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించడంతో పాటు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పనలో మిగతా 2లో..

# మూడో కూటమి దిశగా డీఎంకే అడుగులు!

**మొదటిపేజీ తరువాయి**

ప్రత్యామ్నాయంగా మరో కూటమి ఏర్పాటు దిశగా డీఎంకే ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు పలు ప్రాంతీయ పార్టీల నేతలను సంప్రదించినట్లు సమాచారం. తమిళనాడులో కాంగ్రెస్‌తో సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో డీఎంకే కొత్త రాజకీయ సమీకరణాలపై దృష్టి సారించినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, ఈ ప్రతిపాదనలు ఇంకా చర్చల దశలోనే ఉన్నాయి.

**సీజేపీ నేతల అరెస్టుపై స్టాలిన్ ఆగ్రహం**

ఎన్నికల కమిషన్ తీరుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న సీజేపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆచూకీ వెల్లడించకుండా నిర్బంధించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. శాంతియుత నిరసనలను అణచివేసే ప్రయత్నాలు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తాయని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. గతంలోనూ సీజేపీ నాయకుల నిర్బంధంపై స్టాలిన్ విమర్శలు చేశారు.

# రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం.. 8 మంది మృతి

**మొదటిపేజీ తరువాయి**

ఓ కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్నారు. వీరు రాజస్థాన్‌లోని ఖాటూ శ్యామ్ ఆలయానికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ఎక్స్‌ప్రెస్‌వేపై వెళ్తున్న సమయంలో బస్సు అదుపుతప్పి సుమారు 15 అడుగుల లోతున్న కాలువలో పడిపోయింది. వాహనంలో సుమారు 25 మంది ఉన్నట్లు సమాచారం.

**క్షతగాత్రులకు ఆసుపత్రుల్లో చికిత్స**

సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో చిక్కుకున్న వారిని బయటకు తీసి ఆసుపత్రులకు తరలించారు. క్షతగాత్రులకు కోటాలోని న్యూ మెడికల్ కాలేజీ ఆసుపత్రి, ఎంబీఎస్ ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. బస్సు అదుపుతప్పడానికి గల కారణాలు ఇంకా నిర్ధారణ కాలేదు. డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్లడం లేదా అతివేగం ప్రమాదానికి కారణమై ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# విద్యుత్, నీటిని పొదుపుగా వాడండి

**మొదటిపేజీ తరువాయి**

మారాయని ఆయన పేర్కొన్నారు. "ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# పిల్లలకూ ఇంటర్నెట్ వినియోగ హక్కు ఉంది

**మొదటిపేజీ తరువాయి**

కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

**భావప్రకటన స్వేచ్ఛతో సంబంధం**

రాజ్యాంగంలోని అధికరణం 19(1)(ఎ) కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు ఇంటర్నెట్ వినియోగంతో సంబంధం ఉందని ధర్మాసనం పేర్కొంది. ఇంటర్నెట్ ద్వారా సమాచారం తెలుసుకోవడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం, ఆలోచనలను ఇతరులతో పంచుకోవడం సాధ్యమవుతుందని వివరించింది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో నివసించే పిల్లలకు విద్య, సమాచారం పొందేందుకు ఇంటర్నెట్ ప్రధాన మార్గంగా ఉంటోందని గుర్తు చేసింది.

**ప్రత్యేక అవసరాలున్న పిల్లలకూ ఉపయోగం**

ప్రత్యేక అవసరాలున్న పిల్లలు తమలాంటి వారితో పరిచయాలు పెంచుకోవడానికి, సామాజికంగా అనుసంధానమయ్యేందుకు ఇంటర్నెట్ ఉపయోగపడుతుందని సుప్రీంకోర్టు తెలిపింది. పిల్లల ఆన్‌లైన్ భద్రతపై ఆందోళనలు ఉన్నప్పటికీ, అందరికీ ఇంటర్నెట్‌ను పూర్తిగా నిషేధించడం సరైన మార్గం కాదని పేర్కొంది. హానికరమైన సమాచారాన్ని గుర్తించి తొలగించడంలో సామాజిక మాధ్యమ సంస్థలు విఫలమైతే, అందుకు పిల్లలను బాధ్యులుగా చూడటం సరికాదని అభిప్రాయపడింది. పిల్లల భద్రత కోసం తగిన నియంత్రణలు అవసరమని స్పష్టం చేసింది. సోషల్ మీడియా ఖాతాల్లో ప్రత్యేకంగా 'చైల్డ్ మోడ్'ను ప్రవేశపెట్టే అవకాశాన్ని కూడా ప్రస్తావించింది.

# నకిలీ భూ పత్రాల కేసులో ఇద్దరి అరెస్ట్

**కీసర, అక్టోబర్ 17(ప్రజా క్షేత్రం):**

రాంపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 402లో ప్లాట్ నంబర్ 34కు సంబంధించి నకిలీ భూ పత్రాలు సృష్టించి, ఆస్తిని విక్రయించేందుకు ప్రయత్నించిన కేసులో ఇద్దరు నిందితులను కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. సబ్ రిజిస్ట్రార్ డి. సోనీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మహమ్మద్ ఖదీర్, రెగు రాజులను శనివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి పత్రాలు, నోటరీ స్టాంప్ పేపర్లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసులో ఇతర నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




# దివ్య మృతిపై సమగ్ర విచారణ జరపాలి

- **శ్రీకర ఆసుపత్రి వైద్యంపై కుటుంబ సభ్యుల డిమాండ్**

**కాప్రా, అక్టోబరు 17(ప్రజా క్షేత్రం):**

డెంగ్యూ జ్వరంతో చికిత్స పొందుతూ మృతి చెందిన యాప్రాల్‌కు చెందిన గండు దివ్య (21) మృతిపై నిష్పక్షపాత విచారణ జరిపి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈసీఐఎల్‌లోని శ్రీకర ఆసుపత్రిలో చికిత్స, డిశ్చార్జి విధానం, తిరిగి చేర్చుకున్న అనంతరం తీసుకున్న చర్యలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఆరోగ్యం క్షీణించడంతో దివ్యను సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించగా, అక్టోబరు 16న తెల్లవారుజామున ఆమె మృతి చెందినట్లు తెలిపారు. వైద్య నిర్లక్ష్యం జరిగిందా అనే అంశంపై వైద్య రికార్డులు, పరీక్షల నివేదికలను పరిశీలించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.




# గోదావరికావేరి లింక్‌పై కుట్ర జరుగుతోంది..

**మొదటిపేజీ తరువాయి**

వదిలి వేశారు. ఇప్పుడు శాశ్వతంగా నీళ్లు రాకుండా చేస్తున్నారని మండిపడ్డారు. నీళ్ళు పైసలు పెట్టి కొనలేమని మొన్న సీఎం అన్న మాటలను గుర్తు చేశారు. అంతటి ప్రాధాన్యత ఉన్న నీళ్లను ఎందుకు వదులు కుంటున్నారని ప్రశ్నించారు. ఎల్‌నీనో వస్తుందని తెలిసినప్పుడు దేవాదుల నీళ్ళని ఎందుకు వదిలి పెట్టావు? నువ్వు వదిలి పెడితే చంద్రబాబు నాయుడు ఒడిసి పట్టుకున్నారన్నారు.
ఆంధ్రప్రదేశ్‌లో వర్షపాతం కూడా మన కంటే తక్కువ నమోదు అయిందని, అయినా అక్కడ ఎలాంటి క్రాప్ హాలిడేలు ఇవ్వలేదని మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. "మన నీళ్లను కిందకు వదిలి నందుకు ముందు క్షమాపణ చెప్పు. చంద్రబాబు నాయుడు లేఖ తెలంగాణ హక్కులకు మరణ శాసనం లాంటిది. బొల్లేపల్లిలో ప్రాజెక్ట్ కట్టుకుంటామని చంద్రబాబు అంటున్నారు. బొల్లేపల్లిలో కట్టుకుంటే తెలంగాణకు ఏం లాభం? సమ్మక్క సాగర్‌లో ప్రాజెక్ట్ కడితే తెలంగాణకి న్యాయం జరుగుతుంది. అసలు ఇంటర్ లింకింగ్ నుంచి సమ్మక్క సాగర్‌ను ఎందుకు తీసి వేస్తున్నారు? బొల్లేపల్లి ద్వారా ఇంటర్ లింకింగ్ ఎందుకు చేస్తున్నారు? బొల్లేపల్లి ఏపీ కంట్రోల్ ఉంటుంది. బీఆర్ఎస్ ఉన్నప్పుడు సమ్మక్క సాగర్‌కు సగం అనుమతులు తెచ్చుకున్నాం. ఇప్పుడు ఈ ప్రభుత్వం వల్ల సమ్మక్క సాగర్ డీపీఆర్ కూడా వెనక్కి వచ్చింది. చంద్రబాబు నాయుడు ఈ లేఖలో విన్ విన్ పరిస్థితి ఉంది అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే లాభం జరిగితే విన్ విన్ సిచువేషన్ అవుతుందా? ప్రపంచంలో నీళ్ల కోసం యుద్ధాలు జరుగుతాయి అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వచ్చే నీటి వాటాలను ఎందుకు వదులుకుంటున్నారు. చంద్రబాబు నాయుడుకి 16 మంది ఎంపీలు ఉన్నారు కాబట్టి కేంద్రం వింటుందా? తెలంగాణలో ఉన్న 17 మంది ఎంపీలు ఏం చేస్తున్నారు. కేంద్రం తెలంగాణకి ఎందుకు అన్యాయం చేస్తుంది. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ఏం చేస్తున్నారు. కేంద్రానికి తెలంగాణ అంటే ఎందుకు చిన్న చూపు. కేంద్రం తెలంగాణ గొంతు పిసుకుతాం అంటే ఊరుకోం. గోదావరి జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే ఒప్పుకోం. మరో నీటి ఉద్యమం మొదలు పెడతాం. పార్టీలో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తాం." అని హరీష్ రావు స్పష్టం చేశారు.

# బీజేపీలో 25 మందికి షాక్?

- **గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ కసరత్తు**
- **రెండు ఎమ్మెల్సీ స్థానాలపై కమలదళం గురి**
- **అభ్యర్థుల ఎంపికపై బీజేపీలో తీవ్ర ఉత్కంఠ**
- **ఆశావహుల్లో నిరాశ.. అసలు కారణమేంటి?**
- **బలమైన అభ్యర్థుల కోసం బీజేపీ అన్వేషణ**
- **అభిప్రాయ సేకరణ పూర్తి.. అధిష్టానానికి పేర్లు**
- **60కి పైగా అసెంబ్లీ నియోజకవర్గాలపై బీజేపీ ఫోకస్**
- **గ్రాడ్యుయేట్ ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యూహాలు**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

త్వరలోనే తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అందులో ఒకటి ఉమ్మడి హైదరాబాద్‌రంగారెడ్డిమహబూబ్‌నగర్ జిల్లాల నియోజకవర్గం. మరోటి ఉమ్మడి నల్లగొండవరంగల్‌ఖమ్మం జిల్లాల నియోజకవర్గం. అయితే, ఎమ్మెల్సీ ఎన్నికలను సవాల్‌గా తీసుకున్న బీజేపీ... గట్టిగానే కసరత్తు చేస్తోంది. కానీ ఒక విషయంలో ఆ పార్టీలోని కొందరు ఆశావహులు తీవ్ర నిరాశకు గురయ్యారట. ఏంటా విషయం..? వారి నిరాశకు అసలు కారణమేంటి..? చూద్దాం. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ సుదీర్ఘ కసరత్తు చేస్తోంది. సమీక్షా సమావేశాలు, అవగాహనా మీటింగ్‌లతో గ్రౌండ్ లెవెల్లో హడావుడి చేస్తోంది. ఉమ్మడి హైదరాబాద్‌రంగారెడ్డిమహబూబ్‌నగర్ జిల్లాల నియోజకవర్గం ఒకటి. ఉమ్మడి నల్లగొండవరంగల్‌ఖమ్మం జిల్లాల నియోజకవర్గం మరోటి. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో దాదాపు 60కి పైగా అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇక్కడి గ్రాడ్యుయేట్ ఓటర్లలో పట్టు సాధించగలిగితే... అసెంబ్లీ ఎన్నికల్లో కూడా మంచి ఫలితాలు సాధించవచ్చని అన్ని పార్టీల్లోనూ అంచనాలున్నాయి. బీజేపీ కూడా అదే ఆలోచనతో ఉందట. దీంతో బలమైన అభ్యర్థుల ఎంపికపై బీజేపీ లోతుగా కసరత్తు చేస్తోంది. అభిప్రాయ సేకరణకు కమిటీలు కూడా వేసింది. ఆ కమిటీలు సైతం నివేదికలు సమర్పించాయి. రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలు ఆ నివేదికలపై చర్చించి పేర్లను అధిష్టానానికి పంపించాల్సి ఉంటుంది.
అయితే, హైదరాబాద్‌రంగారెడ్డిమహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల నియోజకవర్గ అభ్యర్థి విషయంలో బీజేపీలో గట్టి పోటీ ఉందట. అనేకమంది నేతలు ఇక్కడ్నుంచి పోటీ చేయడానికి ఆసక్తి చూపించారట. అలా టికెట్ కోసం పోటీపడ్డ ఆశావహులు అధిష్టానం నుంచి వచ్చిన సంకేతాలతో నిరాశకు లోనయ్యారట. దీనంతటికీ కారణం అధిష్టానం ఆల్రెడీ అభ్యర్థిని ఫిక్స్ చేయడమేనట. హైదరాబాద్‌రంగారెడ్డిమహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు పోటీ చేయడం ఖాయమైందట. ఆయన్నే అభ్యర్థిగా ప్రకటించడం దాదాపుగా ఖరారు అయిందని మాటలు వినిపిస్తున్నాయి. అభిప్రాయ సేకరణలో ఆయన పేరే మెజారిటీ నేతలు చెప్పారట. రామచందర్ రావును అధికారికంగా అభ్యర్థిగా ప్రకటించడమే మిగిలిందట. అయితే, అంతకుముందు కొందరు ఆశావహులు బీజేపీలోని కీలక నేతలను కలిశారట. పరిస్థితి అని ఆరా తీశారు. తమ ప్రయత్నాలు కొనసాగించాలా..? వద్దా..? అని అడిగారట. ఆ నేతల నుండి వద్దనే సమాధానం వచ్చిందట. రామచందర్ రావే అభ్యర్థి అవుతారని ఇండికేషన్ ఇచ్చారట. దీంతో ఆశావహులు ఆశలు చాలించుకున్నారట.
నిజానికి హైదరాబాద్‌రంగారెడ్డిమహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం కోసం 25 మందికిపైగా నేతలు ప్రయత్నాలు చేశారట. ఇక్కడ వాతావరణం ఆ పార్టీకి అనుకూలంగా ఉందనే ప్రచారం జరుగుతుండటంతో టికెట్ కోసం క్యూ కట్టారట నేతలు. చాలా మంది ప్రచారం కూడా ప్రారంభించారు. పోస్టర్లు, సోషల్ మీడియాలో పోస్టింగులు కూడా మొదలుపెట్టారట. ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ కోసం సెంటర్లు కూడా ఓపెన్ చేశారట. కొందరైతే కార్యకర్తలు, అనుచరులతో సమావేశాలు కూడా పెట్టుకున్నారట. గేటెడ్ కమ్యూనిటీలకు వెళ్లి మరీ ఓటు నమోదు చేయించుకోవాలని కోరారట. యాప్స్ కూడా తయారు చేసుకున్నారట. తీరా... రామచందర్ రావే అభ్యర్థి అవుతారని క్లారిటీ రావడంతో వాళ్ళంతా నిరాశకు లోనయ్యారట. ఇంత పనిచేసుకున్న తర్వాత పార్టీ అధ్యక్షుడే బరిలోకి దిగుతుండటంతో చేసేదేముందని నసుగుతున్నారట. నిరాశ, అసంతృప్తికి లోనైనా అధ్యక్షులవారి కోసం పని చేయక తప్పదు కదా అని నిట్టూరుస్తున్నారట బీజేపీ నాయకులు.




# పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, సానిటేషన్ కిట్ల పంపిణీ

- **శంకర్‌పల్లి మున్సిపాలిటీలో కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య**

**శంకర్ పల్లి అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

శంకర్‌పల్లి పురపాలక సంఘం కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, సానిటేషన్ కిట్లను చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య, మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్‌తో కలిసి పంపిణీ చేశారు. పారిశుద్ధ్య కార్మికులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన రక్షణ పరికరాలను వినియోగించడం ముఖ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కాసెట్టి చంద్రమోహన్, శంకర్‌పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మడపతి చంద్రమౌళి, కౌన్సిలర్లు, పీఏసీఎస్ డైరెక్టర్లు, సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో తీవ్ర కరవు, 315 మండలాల్లో కరవు ఛాయలు

**మొదటిపేజీ తరువాయి**

ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.
ఇదే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన అనధికారిక క్యాబినెట్ సమావేశంలోనూ సుదీర్ఘంగా చర్చ జరిగింది. రాష్ట్రంలోని 315 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయని, వాటిలో 101 మండలాల్లో తీవ్ర కరవు, 214 మండలాల్లో ఓ మోస్తరు కరవు నెలకొందని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు రూ. 1,986.89 కోట్లతో కూడిన సహాయ ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.
గణాంకాల ప్రకారం, జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య రాష్ట్రంలో సాధారణంగా 740.6 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 615.5 మి.మీ. మాత్రమే నమోదైంది. అక్టోబర్ 15 నాటికి ఈ వర్షపాత లోటు 23 శాతానికి చేరింది. దీని ప్రభావంతో గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం 13.22 లక్షల ఎకరాలు తగ్గి, 126.06 లక్షల ఎకరాలకు పరిమితమైంది. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 3.58 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.
మరోవైపు, రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. 466 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం కేవలం 209.45 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, సాగునీటి విడుదలను పరిమితం చేయాలని అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. కరవును అధికారికంగా ప్రకటించి, కేంద్రం నుంచి గరిష్ఠంగా సాయం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నివేదికను సిద్ధం చేస్తోంది.

# పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకలు

**కాప్రా, అక్టోబర్ 17(ప్రజా క్షేత్రం):**

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోని కాప్రా సర్కిల్ పరిధిలోని డా:ఏఎస్ రావు నగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు రేగళ్ల సతీష్ రెడ్డి జన్మదినం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకగా బట్టలు పంపిణీ చేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్మికులకు బట్టలు అందజేసి, కేక్ కట్ చేసి సతీష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# నాగారంలో వైభవంగా బతుకమ్మ సంబరాలు

- **అనంత్ రెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా వేడుకలు**
- **ముఖ్య అతిథిగా మాజీ మంత్రి హరీశ్‌రావు.. పాల్గొన్న ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి**

**నాగారం, అక్టోబరు 17(ప్రజా క్షేత్రం):**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఘట్‌కేసర్ సర్కిల్ నాగారం డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ కౌకుట్ల అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని నాగారం డివిజన్‌లో మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటలు, కోలాటాలతో సందడి చేశారు. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో వేడుకల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.
తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం బతుకమ్మ పండుగకు రాష్ట్రవ్యాప్తంగా విశేష ప్రాధాన్యం లభించిందని, తెలంగాణ ఆడపడుచుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నాగారంలో వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని పలువురు పేర్కొన్నారు. ఆధునిక జీవనశైలిలోనూ సంప్రదాయాలను కాపాడుతూ, భావితరాలకు వాటిని అందించడంలో ఇలాంటి వేడుకలు కీలకమని అభిప్రాయపడ్డారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, పద్మా దేవేందర్‌రెడ్డి, గొంగిడి సునీతారెడ్డి, మాజీ కార్పొరేటర్ పావని రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

**అనంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు**

బతుకమ్మ వేడుకలు నిర్వహించిన రోజే మాజీ కౌన్సిలర్ కౌకుట్ల అనంత్‌రెడ్డి జన్మదినం కావడంతో కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు, మహిళలు, నాగారం డివిజన్ ప్రజలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ సంబరాలను ఇంత వైభవంగా నిర్వహించిన అనంత్‌రెడ్డిని పలువురు అభినందించారు. పండుగ వేడుకలు, జన్మదిన శుభాకాంక్షలతో నాగారంలో సందడి నెలకొంది.






## జల్లాపల్లి ఫారం వద్ద కారును ఢీకొన్న ట్రాక్టర్

- - ఒకరికి గాయాలు,ఆసుపత్రికి తరలించిన స్థానికులు

**కోటగిరి అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

పోతంగల్ మండలం జిల్లా పల్లి ఫారం వద్ద శనివారం రాత్రి కారు ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జల్లాపల్లి ఆబాది గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కారులో జల్లపల్లి ఆబాది నుండి జల్లాపల్లి ఫారం వైపుకు వస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా కారును ఢీకొనడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో కారులో ఒకే వ్యక్తి ఉండగా బెలూన్లు ఓపెన్ అవ్వడంతో ప్రాణాపాయం తప్పింది. ఆయన తలకు తీవ్ర గాయం అవ్వగా వెంటనే అక్కడ ఉన్నవారు ఆయనను కోటగిరి లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా వడ్ల తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. అతివేగంగా ట్రాక్టర్ నడపడమే కాకుండా ఒక్కసారిగా మూలమలుపు తిప్పడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. ఈ విషయమై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అంబేద్కర్, జ్యోతిరావ్ పూలే ఆశయాలను కొనసాగించాలి

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

**సంస్థాన్ నారాయణపురం అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని లింగవారిగూడెం గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మరియు మహాత్మ జ్యోతిరావ్ పూలే విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కత్తుల హరికృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మరియు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో అణగారిన బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆ మహనీయులు జీవితాంతం నిరంతరం పోరాడారని కొనియాడారు. వారిద్దరూ చూపిన బాటలో నడవాలని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అంబేద్కర్ సంఘం సభ్యులు, ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## పైలెట్ రోహిత్ రెడ్డి పై తప్పుడు ప్రచారం చేస్తే సహించబోము.

- యాలాల మండల పార్టీ శాఖ నాయకులు.

**యాలాల అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పై సోషల్ మీడియా లో తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిని గుర్తుంచి చర్యలు తీసుకోవాలని యాలాల మండల బీ ఆర్ ఎస్. నాయకులు శనివారం యాలాల పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యాలాల మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఫేక్ వార్తలు ప్రచురించి తాండూర్ ప్రజలను గందరగోలానికి గురి చేస్తూ, రాజకీయ లబ్ది కోసం పైలట్ రోహిత్ రెడ్డి పై అనవసర వార్తలు ప్రచురించిన వారిని మరియు తాండూర్ గుస గుస అనే వెబ్ సైట్ లో వచ్చిన అబద్దపు వార్తలు ప్రచురించిన, పంపిన, వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని అన్నాడు. రాజకీయలబ్ది కోసం అబద్దపు ప్రచారాలు చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకువాలని ఫిర్యాదు చేశామని అన్నాడు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్ తో పాటు ఆశన్న, నాగారం పాండు గౌడ్, కృష్ణ, గణేష్ ముదిరాజ్, కమ్మరి శేఖర్, మొగులయ్య, మహేష్, బాలు, కొత్త శ్రీనివాస్ ఉన్నారు.




## కరన్‌కోట్ ఎస్ఐ రాథోడ్ వినోద్ బదిలీ

- 15 నెలల పాటు ప్రజలతో మమేకమై విధులు.

**తాండూరు, అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం)**

తాండూరు మండలం కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాథోడ్ వినోద్ బదిలీ అయ్యారు. 2025 జూలైలో కరన్‌కోట్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఆయన సుమారు 15 నెలల పాటు విధులు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ, ప్రజలతో మమేకమై తనదైన శైలిలో విధులు నిర్వర్తించారు. పేద, మధ్యతరగతి కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన రాథోడ్ వినోద్ ఎస్సైగా తొలిసారిగా బాధ్యతలు చేపట్టి, తన పరిధిలో పోలీస్ విధులను నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందారు. విధి నిర్వహణలో భాగంగా ఉన్నతాధికారుల సూచనలకు అనుగుణంగా పనిచేస్తూ తన బాధ్యతలను నిర్వర్తించారు.

కాగా, వినోద్ బదిలీతో కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై స్థానం ఖాళీ అయింది. ఆయన స్థానంలో నూతన ఎస్సైగా అన్వేష్ రెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికార వర్గాల వల్ల వెల్లడైంది,

# ఏందిన్నాయనా.. మన ఊరి పరిస్థితి!

- ఎండలు ఎండుతున్నాయి.. వానలు రావట్లేదు.. నీళ్ల కోసం అల్లాడుతున్నాం!
- పల్లె ప్రజల గుండెల్లో గుబులు..
- రైతన్న కళ్లల్లో దిగులు.. బిందెడు నీళ్ల కోసం ఎదురుచూపులు.. రేపటి బతుకుపై భరోసా ఏది?

ఏందిన్నాయనా.. మన ఊరి పరిస్థితి ఎట్లయిపోయిందో జూస్తున్నావా? ఎండలు ఎండుతున్నయ్.. వానలు రావట్లే.. చెరువులల్ల నీళ్లు ఎట్లున్నయో తెల్వట్లే.. బోర్లల్ల నీళ్లు వస్తున్నయో రావట్లేదో అర్థం కావట్లే! ఇట్లనే ఇంకొన్ని రోజులు పోతే మన బతుకులెట్లా సామీ? పంటలు పండుతయా.. పండక ఎండిపోతయా? ఇంట్ల తాగేటందుకు నీళ్లు ఉంటయా.. లేక బిందెలు పట్టుకొని ఊరంతా తిరగాల్నా? ఇప్పుడు పల్లెల్లో సామాన్యుడి నుంచి రైతన్న వరకు ప్రతి ఒక్కరి మనసులోనూ మెదులుతున్న ప్రశ్నలు ఇవే. ప్రకృతి ఎట్లుంటదో ఎవరికీ తెల్వదు. కానీ ప్రకృతి మీద ఆధారపడి బతికే పల్లె మనిషికి మాత్రం ప్రతి రోజూ ఒక కొత్త పరీక్షే!

**"ఏందన్నా.. ఈ ఎండలు ఇట్లనే ఉంటే మన బతుకులెట్లా?"**

"ఏందన్నాయనా.. పొద్దుగాల లేస్తే ఎండ మొకం మీద కొడుతున్నట్టుంది. ఇంటి బయటికి పోతే సెగ.. పొలానికి పోతే సెగ.. రోడ్డు మీద నడిస్తే సెగ. అసలే వానలు సక్కగ పడలే. ఎండలు మాత్రం తగ్గుతలేవు. ఇగ ముందు రోజులు ఎట్లుంటయోనని భయమైతుంది. మన ఊర్లల్ల చెరువులు, కుంటలు నిండితే కొంత ధైర్యముంటది. అవి సక్కగ నిండకపోతే బోర్ల మీదనే ఆధారపడాలె. బోర్లల్లో నీళ్లు తగ్గిపోతే ఇంకేముంటది మనకు దిక్కు? పైసలున్నోళ్లు ఇంకో బోరు వేయించుకుంటరు. మనలాంటి పేదోళ్లు ఎక్కడికి పోవాలె? ఉన్న బోరు ఎండిపోతే మళ్లీ బోరు వేయించేటందుకు లక్షలు ఎక్కడి నుంచి తేవాలె?" అని ఓ పల్లె మనిషి తన మనసులోని ఆవేదనను వెళ్లగక్కుతున్నట్టుగా పరిస్థితి కనిపిస్తోంది.

ఒకప్పుడు పల్లెల్లో వానాకాలం వస్తుందంటే రైతన్న మొకంలో సంతోషం కనిపించేది. ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటే చాలు.. పొలాల వైపు పరుగులు తీసేవారు. దుక్కులు దున్ని, విత్తనాలు వేసి, పంటలు పండించాలనే ఆశతో పనులు మొదలుపెట్టేవారు. కానీ వర్షాలు అనుకున్న సమయానికి పడకపోతే ఆ ఆశలన్నీ ఆందోళనగా మారతాయి. వాన పడుతుందో లేదోనని ఆకాశం వైపు చూడటం, నేలలో తేమ ఉందో లేదోనని పొలాన్ని పరిశీలించడం, బోరులో నీరు తగ్గిందేమోనని మోటారు దగ్గరకు వెళ్లి చూడటం.. ఇవే రైతన్నకు నిత్యకృత్యాలవుతాయి.

**"వానొస్తేనే కదన్నా.. రైతుకు ధైర్యం వచ్చేది!"**

"ఏందన్నా.. రైతు బతుకే అట్లుంటది. వానొస్తే సంతోషం.. వాన రాకపోతే బాధ. పంట ఏసినంక మొలక మంచిగ రావాలె. మొలక వచ్చినంక పంట ఏపుగా పెరగాలె. పూత రావాలె.. కాత కాయాలె.. అప్పుడే కదా మనకు నాలుగు పైసలు మిగిలేది? విత్తనాలు కొన్నం, ఎరువులు కొన్నం, మందులు కొన్నం. కూలీలకు పైసలిచ్చినం. ట్రాక్టరు కిరాయి కట్టినం. ఇన్ని ఖర్చులు పెట్టి పంట ఏస్తే చివరికి వానలు లేక పంట ఎండిపోతే మన పరిస్థితి ఏందన్నా? అప్పులు కట్టాలె.. ఇంటి ఖర్చులు చూడాలె.. పిల్లల చదువులు చూసుకోవాలె. పంట చేతికి రాకపోతే ఇవన్నీ ఎట్లా సాధ్యమైతయ్?" అని రైతు కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఒత్తిడి గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది.

పల్లెల్లో వ్యవసాయం అనేది కేవలం పంట పండించడం మాత్రమే కాదు. ఒక కుటుంబం మొత్తం దాని మీద ఆధారపడి ఉంటుంది. రైతు పంట వేస్తే వ్యవసాయ కూలీకి పని దొరుకుతుంది. ట్రాక్టరు యజమానికి పని ఉంటుంది. ఎరువుల దుకాణంలో అమ్మకాలు జరుగుతాయి. పంట చేతికొస్తే గ్రామంలో డబ్బు చలామణి అవుతుంది. పంట దెబ్బతింటే రైతు ఒక్కడే నష్టపోడు. అతనిపై ఆధారపడిన అనేక కుటుంబాల జీవనోపాధిపైనా ప్రభావం పడుతుంది.

అందుకే వర్షాలు తగ్గినప్పుడు రైతన్న ఎదుర్కొనే సమస్యలను ముందుగానే గుర్తించాలి. ఏ గ్రామంలో ఎంత వర్షపాతం నమోదైంది? ఏ మండలంలో పంటల పరిస్థితి ఎలా ఉంది? ఏ ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గుతున్నాయి? ఎక్కడ సాగునీటి కొరత ఉంది? అనే వివరాలను వ్యవసాయ, నీటిపారుదల శాఖలు సమగ్రంగా పరిశీలించాలి.

**"మా ఇంట్ల నీళ్లు లేకపోతే ఎట్లా బతకాలె?"**

"ఏందమ్మా.. పొద్దుగాల ఇంటి పనులు మొదలుపెట్టాలంటే ముందు నీళ్ల సంగతి చూడాలె. నీళ్లు వస్తే వంట చేసుకోవచ్చు.. పిల్లలకు స్నానం చేయించొచ్చు.. బట్టలు ఉతుక్కోవచ్చు. నీళ్లు రాకపోతే ఒక్క పని కూడా ముందుకు పోదు. బిందెలు పట్టుకొని నీళ్ల కోసం తిరిగితే ఇంటి పనులు ఎట్లా చేయాలె? పిల్లలను బడికి ఎట్లా పంపాలె? ఇంట్ల పెద్దోళ్లు ఉంటే వాళ్ల అవసరాలు ఎట్లా చూడాలె? నీళ్లు అనేవి మనకు రోజూ కావాలె కదా! తిండి లేకుంటే కొన్ని గంటలు ఉండగలం గానీ.. నీళ్లు లేకుంటే బతుకే ఎట్లా సాగుతది?" అని గ్రామీణ మహిళల జీవన పరిస్థితులను అర్థం చేసుకోవాలి.

తాగునీటి సరఫరా అనేది ప్రతి కుటుంబానికి సంబంధించిన మౌలిక అవసరం. గ్రామానికి నీళ్లు సరఫరా చేసే పైపులైన్లు సక్రమంగా పనిచేస్తున్నాయా? ఓవర్‌హెడ్ ట్యాంకులు సమయానికి నింపుతున్నారా? ఎక్కడైనా పైపులు లీకవుతున్నాయా? మోటార్లు పనిచేయక నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందా? అనే విషయాలను గ్రామ పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి.

నీటి సమస్య వచ్చిన తరువాత హడావుడి చేయడం కంటే, సమస్య రాకముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం మంచిది. అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడం, దెబ్బతిన్న పైపులైన్లను మరమ్మతు చేయడం, నీటి వృథాను అరికట్టడం వంటి చర్యలు చేపట్టాలి.

**"బోర్లల్ల నీళ్లు తగ్గితే రైతు ఏం చేయాలె?"**

"ఏందన్నాయనా.. మా ఊర్లల్ల చాలామంది బోర్ల మీదనే పంటలు పండిస్తరు. వానలు సక్కగ పడకపోతే భూమిలో నీళ్లు పెరుగుతయా? బోరు నీళ్లు తగ్గితే మోటారు ఎంతసేపు నడుపుతం? నీళ్లు రాకపోతే పంటకు తడి ఎట్లిస్తం? ఒకసారి బోరు ఎండిపోతే మళ్లీ లోతు పెంచాలె. దానికి పైసలు కావాలె. కొత్త బోరు వేయాలంటే ఇంకా ఎక్కువ ఖర్చు. అప్పటికే అప్పులు చేసిన రైతు ఇంకెన్ని అప్పులు చేయాలె? నీళ్లు ఉన్నప్పుడు పంట పండించుకోవాలె.. నీళ్లు లేనప్పుడు ఏం చేయాలో ఎవరో ఒకరు చెప్పాలె కదా!" అనే ప్రశ్న రైతుల నీటి భద్రతపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది.

భూగర్భ జలాలు ఒకసారి తగ్గితే అవి వెంటనే తిరిగి పాత స్థాయికి చేరుకోవు. వర్షపు నీరు నేలలోకి ఇంకడం, చెరువులు, కుంటలు నిండడం, భూగర్భ జలాల వినియోగం వంటి అనేక అంశాలపై వాటి స్థాయి ఆధారపడి ఉంటుంది. అందుకే ప్రతి గ్రామంలో వర్షపు నీటిని నిల్వ చేసే విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

చెరువుల కట్టలు, తూములు, కాలువలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలి. చెరువుల్లోకి వచ్చే నీటి మార్గాల్లో ఆక్రమణలు, అడ్డంకులు ఉంటే వాటిని చట్టబద్ధంగా పరిష్కరించాలి. ఇళ్లపై పడే వర్షపు నీటిని నిల్వ చేసే ఏర్పాట్లు, పొలాల్లో నీటి కుంటలు, భూగర్భ జలాల పునరుద్ధరణకు ఉపయోగపడే నిర్మాణాలను ప్రోత్సహించాలి.



**"వానలు పడకపోతే పంటల పరిస్థితి ఏందన్నా?"**

రైతన్నకు పంట అనేది కేవలం ఆదాయం కాదు. ఏడాది మొత్తం కుటుంబాన్ని నడిపించే ఆధారం. పంట బాగుంటే అప్పులు తీర్చుకోవచ్చు. పిల్లల చదువులకు ఖర్చు పెట్టవచ్చు. ఇంట్లో అవసరమైన వస్తువులు కొనుక్కోవచ్చు. కానీ పంట దెబ్బతింటే ఒక్కసారిగా కుటుంబ ఆర్థిక పరిస్థితి మారిపోతుంది.

వర్షాధార పంటలకు నేలలో తేమ చాలా ముఖ్యం. వర్షాలు ఆలస్యంగా పడినా, మధ్యలో దీర్ఘకాలం వర్షాలు లేకపోయినా పంట ఎదుగుదలపై ప్రభావం పడే అవకాశం ఉంది. పూత, కాత దశల్లో తేమ లోపిస్తే దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంటుంది. అయితే ప్రతి పంటకు ఒకే రకమైన ప్రభావం ఉండదు. పంట రకం, సాగు దశ, నేల స్వభావం, స్థానిక వర్షపాతం ఆధారంగా పరిస్థితి మారుతుంది.

ఇలాంటి సమయంలో వ్యవసాయ అధికారులు రైతులకు స్థానిక పరిస్థితులకు సరిపోయే సూచనలు ఇవ్వాలి. నీటిని పొదుపుగా వినియోగించే పద్ధతులు, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయాలు, పంటల బీమా, అర్హత మేరకు నష్టపరిహారం వంటి అంశాలపై అవగాహన కల్పించాలి.

**"మా పిల్లల భవిష్యత్తు ఎట్లుంటదోనన్నా!"**

"ఏందన్నా.. మేం కష్టపడేది మా పిల్లల కోసమే కదా! వాళ్లు మంచిగ చదువుకోవాలె.. మాకంటే మంచిగ బతకాలె. కానీ ఇంటి ఖర్చులు పెరుగుతున్నయ్. పంటలు సక్కగ పండకపోతే ఆదాయం తగ్గుతది. నీళ్ల సమస్య వస్తే ఇంటి పనులకే ఇబ్బంది. పని దొరకకపోతే కూలీల పరిస్థితి ఇంకా కష్టం. ఇట్లా ప్రతి విషయానికి డబ్బు కావాల్సి వస్తే పేద కుటుంబాలు ఎట్లా నెట్టుకొస్తయ్? మాకు పెద్ద పెద్ద ఆశలేం లేవు. తాగడానికి నీళ్లు ఉండాలె.. పని దొరకాలె.. పంట పండాలె.. పిల్లలు మంచిగ చదువుకోవాలె. అంతే కదా మా కోరిక!" అనే భావన గ్రామీణ కుటుంబాల ఆర్థిక భద్రత ఎంత ముఖ్యమో తెలియజేస్తుంది.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం ఒక్కటే ఉపాధి మార్గంగా ఉన్న కుటుంబాలకు వర్షాభావ పరిస్థితులు మరింత ఇబ్బందికరంగా మారవచ్చు. వ్యవసాయ పనులు తగ్గితే కూలీలకు పని దొరకడం కష్టమవుతుంది. పనుల కోసం పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చు. అందుకే గ్రామీణ ఉపాధి కార్యక్రమాలు సక్రమంగా అమలవుతున్నాయా? కూలీలకు పనులు కల్పిస్తున్నారా? చేసిన పనికి వేతనాలు సమయానికి అందుతున్నాయా? అనే విషయాలను కూడా పరిశీలించాలి.

**"అధికారులూ.. మా ఊరి పరిస్థితి ఒక్కసారి చూడండయ్యా!"**

గ్రామాల్లో నీటి సమస్యను ఎదుర్కొంటున్న ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండటం ముఖ్యం. కార్యాలయాల్లో కూర్చొని నివేదికలు పరిశీలించడం మాత్రమే సరిపోదు. సమస్య ఉందని సమాచారం వచ్చిన గ్రామాలకు వెళ్లి పరిస్థితిని పరిశీలించాలి. తాగునీటి సరఫరాలో లోపాలు ఉంటే వాటిని సరిచేయాలి. పంట నష్టంపై ఫిర్యాదులు వస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. అర్హులైన రైతులకు అందాల్సిన ప్రభుత్వ సహాయం ఆలస్యం కాకుండా చూడాలి.

జిల్లా యంత్రాంగం, గ్రామ పంచాయతీలు, వ్యవసాయ శాఖ, భూగర్భ జలాల శాఖ, నీటి పారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలి. గ్రామాలవారీగా నీటి లభ్యత, చెరువుల నిల్వలు, బోర్ల పరిస్థితి, తాగునీటి సరఫరా వివరాలను సేకరించి ప్రజలకు తెలియజేయాలి.

వర్షాభావ పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలకు వాస్తవ సమాచారం అందించడం కూడా అంతే ముఖ్యం. ఎక్కడ నీటి సమస్య తీవ్రంగా ఉంది? ఎక్కడ పంటలకు నష్టం వాటిల్లింది? ఏ గ్రామాలకు ప్రత్యామ్నాయ నీటి సరఫరా అవసరం? ఏ ప్రాంతాల్లో పరిస్థితి సాధారణంగా ఉంది? అనే వివరాలను స్పష్టంగా వెల్లడించాలి.

**నీటిని కాపాడుకుంటేనే రేపటి బతుకుకు భరోసా**

వర్షాలు మన చేతుల్లో లేవు. కానీ పడిన వాన నీటిని ఎలా నిల్వ చేసుకోవాలి? ఉన్న నీటిని ఎలా పొదుపుగా వాడుకోవాలి? భూగర్భ జలాలను ఎలా సంరక్షించుకోవాలి? అనే విషయాల్లో మనం చర్యలు తీసుకోవచ్చు. ప్రతి ఇంట్లో నీటి వృథాను తగ్గించడం, ప్రతి గ్రామంలో చెరువులు, కుంటలను పరిరక్షించడం, వర్షపు నీటిని నేలలోకి ఇంకేలా ఏర్పాట్లు చేయడం అవసరం.

గ్రామీణ ప్రజల జీవితాల్లో నీటి సమస్య అనేది ఒక రోజు ఎదురయ్యే ఇబ్బంది కాదు. అది వ్యవసాయం, ఉపాధి, ఆరోగ్యం, విద్య, కుటుంబ ఆర్థిక పరిస్థితులన్నింటినీ ప్రభావితం చేయగల సమస్య. అందుకే నీటి నిర్వహణను తాత్కాలిక చర్యగా కాకుండా దీర్ఘకాలిక ప్రణాళికగా తీసుకోవాలి.ఏందన్నాయనా.. మన ఊరి పరిస్థితి ఎట్లున్నా, రేపటి బతుకును కాపాడుకోవాలంటే ఇప్పటినుంచే నీటిని పొదుపు చేసుకోవాలె. రైతు పంటను కాపాడుకోవాలె. పల్లెకు తాగునీటి భరోసా కల్పించాలె. అధికారులు ప్రజల మధ్యకు రావాలె. సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలె. ఎందుకంటే నీరు ఉంటేనే పల్లె బతుకుతది.. పల్లె బతికితేనే రైతు బతుకుతడు.. రైతు బతికితేనే మన అందరి బతుకులకు భరోసా ఉంటది!



ఎం రవీందర్
సీనియర్ జర్నలిస్ట్
7901503777

## ఎల్‌నినో ప్రభావంపై గ్రామసభ.. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచన

- వాతావరణ మార్పులు, వ్యవసాయంపై ప్రభావంపై చర్చ
- సమావేశంలో పాల్గొన్న సర్పంచ్ బండ లక్ష్మి నర్సింహా
- రైతులకు అవగాహన కల్పించడంపై దృష్టి

**శంకర్ పల్లి, అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, వ్యవసాయ రంగంపై వాటి ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికలు రూపొందించుకోవాలని చర్చించినట్లు తెలిసింది. గ్రామ సర్పంచ్ బండ లక్ష్మీ నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఉపసర్పంచ్ కవేలి గోవర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.సమావేశంలో వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు ఎదుర్కొనే సమస్యలు, వ్యవసాయ పనుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అంశాలపై చర్చించారు. వర్షపాతం పరిస్థితులను గమనిస్తూ, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటల సాగు, నీటి వినియోగంపై నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.గ్రామంలో రైతులకు, ప్రజలకు అవసరమైన సమాచారం చేరవేయడంలో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని సమావేశంలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. వాతావరణ పరిస్థితులపై సంబంధిత శాఖల నుంచి వచ్చే సూచనలను రైతులకు తెలియజేయడంతో పాటు, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఉపసర్పంచ్ కవేలి గోవర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు ఏనుగు నరేందర్ రెడ్డి, నట్టల అనిత రమేష్, ఉమెతల శ్వేతా వినోద్ కుమార్, కొట్టే ప్రశాంత్, ఎంకేపల్లి మాధవ్, బెగరి సింహం రాజు, బుర్డుల సునీత శ్రీనివాస్, కొల్లన్ రమాదేవి, కవేలి తిరుపతి రెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు. గ్రామ పెద్దలు సురకంటి సత్యం రెడ్డి, మందుముల యాదయ్య, బుర్డుల నవీన్ కుమార్, బిరుదు గణేష్ తదితరులు హాజరయ్యారు.




## వడ్డీ వ్యాపారుల ఇళ్లల్లో పోలీసుల సోదాలు..?

- భారీ మొత్తంలో నగదు సీజ్..?
- పలువురిపై కేసు నమోదు..?

**కోటగిరి అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతంగల్ మండల కేంద్రంలో వడ్డీ వ్యాపారులు, ప్రైవేట్ ఫైనాన్స్ నిర్వాహకుల ఇళ్లపై పోలీసులు దాడులు చేసి సోధాలు నిర్వహించారు. మీ దాడులలో భారీ మొత్తంలో నగదును పోలీసులు సీజ్ చేసినట్లు సమాచారం. నిజామాబాద్ సిపి ఆదేశాల మేరకు ఈ దాడులు జరిగినట్లు తెలుస్తుండగా... దాదాపు పదిమంది వడ్డీ వ్యాపారుల ఇళ్లలో ఉదయం 5 గంటల నుండి ఏకకాలంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించినట్లు తెలుస్తుంది. ఈ సోదాలలో ఏకంగా రూ.70 లక్షల నగదును పోలీసులు సీజ్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కాగా భారీ మొత్తంలో వారి నుండి ప్రామిసరీ నోట్లను సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై పోలీసులు అధికారికంగా ఎలాంటి సమాచారం బహిర్గతం చేయకపోయినప్పటికీ వడ్డీ వ్యాపారులu, ఫైనాన్స్ నిర్వాహకుల నుండి పెద్ద మొత్తంలో నగదు సిగ్గేసి పలువురిపై కేసు నమోదు చేసినట్లు తెలుస్తుంది. ఈ విషయమై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# రెండవ రోజు కొనసాగిన శత చండీ యాగం

**కోటగిరి అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

కోటగిరి మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గామాత రజోత్సవ వేడుకల్లో భాగంగా ఈసారి నిర్వహిస్తున్న శత చండీ యాగం శనివారం రెండవ రోజు ఘనంగా కొనసాగింది. కోటగిరి మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్ దంపతులు సహా మరికొంద రు దంపతులతో శత చండి యాగాన్ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విఠలేశ్వర ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. చండీ హోమము సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భవాని స్వాములు, పాల్గొన్నారు.



# ఎల్‌నినో నేపథ్యంలో రైతులు ముందు చూపుతో ఆలోచించాలి

- **యాసంగిలో వరికి బదులుగా తక్కువ నీరు అవసరమయ్యే పంటలు సాగు చేయాలి**
- **రైతులకు మండల వ్యవసాయ అధికారి రాజు సూచన**

**కోటగిరి, అక్టోబర్ 16(ప్రజాక్షేత్రం):**

రాబోయే యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ముందుచూపుతో ఆలోచించాలని వరి సాగుకు బదులుగా తక్కువ నీరు అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కోటగిరి మండల వ్యవసాయ అధికారి రైతులకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరి పంటకు అధిక మొత్తంలో నీరు అవసరమవుతుందని రాబోయే రోజుల్లో వాతావరణ పరిస్థితుల కారణంగా నీటి లభ్యత తగ్గే అవకాశం ఉండటంతో పాటు, భూగర్భ జలమట్టాలు కూడా తగ్గే పరిస్థితులు ఏర్పడవచ్చని ఇలాంటి పరిస్థితుల్లో వరి సాగు చేపడితే నీటి కొరత కారణంగా పంటకు నష్టం వాటిల్లి, రైతులు పెట్టిన పెట్టుబడిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల రైతులు ముందుచూపుతో ఆలోచించి పంటల ఎంపిక చేసుకోవడం చాలా అవసరమన్నారు.ఈ నేపథ్యంలో రైతులు శనగ, మినుము, పెసర, పొద్దు తిరుగుడు వంటి తక్కువ నీరు అవసరమయ్యే పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ పంటలను స్థానిక నేలల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఎంపిక చేసుకోవాలన్నారు. రైతులు అధిక నీటి అవసరమయ్యే వరి పంటను సాగు చేయడానికి ముందుగా అందుబాటులో ఉన్న నీటి వనరులను అంచనా వేసుకోవాలని నీటి లభ్యతపై స్పష్టత లేకుండా వరి సాగు చేపట్టి అధిక పెట్టుబడులు పెట్టడం వల్ల ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు పెట్టుబడికి రక్షణ కల్పించుకోవచ్చని, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వనరుల లభ్యతను దృష్టిలో ఉంచుకొని యాసంగిలో వరి సాగును నివారించి, తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని రైతులకు సూచించారు.






# శ్రీ మహాలక్ష్మీ దేవిగా భక్తులకు సాక్షాత్కరించిన బంగారమ్మ తల్లి

**నందవరం, అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

మండల కేంద్రమైన నందవరంలో కొలువైన శ్రీ మాతా బంగారమ్మ దేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఏడో రోజు అత్యంత భక్తిశ్రద్ధలతో, కన్నులపండువగా కొనసాగాయి. ఆశ్వయుజ సప్తమి శనివారం సందర్భంగా తెల్లవారుజాము నుంచే అర్చకులు అనిల్ స్వామి పర్యవేక్షణలో వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి పంచామృతాభిషేకాలు, విశేష కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

**శ్రీ మహాలక్ష్మీ దేవి అవతారంలో దివ్య దర్శనం:**

నవరాత్రులలో ఏడో రోజైన సప్తమి పర్వదినాన జగన్మాత సకల శుభప్రదాయిని, అష్టైశ్వర్యాల అధిదేవత అయిన శ్రీ మహాలక్ష్మీ దేవి అవతారంలో భక్తులకు దివ్యమంగళ రూపాన్ని సాక్షాత్కరింపజేశారు. స్వర్ణాభరణాలు, పట్టు వస్త్రాలు, తామర పూల మాలలతో శోభాయమానంగా కొలువైన అమ్మవారిని దర్శించుకుంటే దారిద్ర్య బాధలు తొలగి సకల సంపదలు, శాంతిసౌఖ్యాలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని పురోహితులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా స్థానిక భక్తులతో పాటు మండలంలోని పరిసర గ్రామాల నుంచి మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి క్యూలైన్లలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. శరన్నవరాత్రుల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలతో నందవరం ఆధ్యాత్మిక శోభతో పులకించిపోయింది. భక్తులంతా అమ్మవారి నామస్మరణలతో భక్తిపారవశ్యంలో మునిగితేలారు.



# క్రీడా స్ఫూర్తితోనే విజయ శిఖరాలు

- **వచ్చే దసరాకు రాష్ట్రంలోని 33 జిల్లాల్లో క్రీడా పోటీలు**
- **వనపర్తి ఛాంపియన్‌షిప్ కప్ ముగింపు వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి**
- **ఛాంపియన్‌గా వనపర్తి జట్టు విజేతలకు నగదు బహుమతులు**

**వనపర్తి, అక్టోబరు 17(ప్రజాక్షేత్రం):**

క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమికి కుంగిపోకుండా క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి యువతకు పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని సూచించారు. యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి తగిన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. వనపర్తి ఛాంపియన్‌షిప్ కప్ 2026 తరహాలో వచ్చే ఏడాది దసరా నాటికి రాష్ట్రంలోని 33 జిల్లాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తామని ప్రకటించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన వనపర్తి ఛాంపియన్‌షిప్ కప్2026 ముగింపు కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డి.సునీతారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కొత్తకాపు శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ప్రతిభకు పట్టం కట్టాలి**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆలోచనతో ఛాంపియన్‌షిప్ కప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. యువతను క్రీడల వైపు మళ్లించాలనే ముఖ్యమంత్రి ఆలోచనకు అనుగుణంగా ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తోందని చెప్పారు. విద్యార్థులు చిన్నచిన్న సమస్యలకే కుంగిపోకుండా క్రీడల ద్వారా ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యం పెంపొందించుకోవాలని సూచించారు. యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేలా క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. వనపర్తి జిల్లాలో ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, వారిని గుర్తించి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. బాక్సర్ నిఖత్ జరీన్, క్రికెటర్ మహమ్మద్ సిరాజ్ వంటి వారు తమ ప్రతిభతో దేశానికి గుర్తింపు తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఆట ఎవరి సొత్తు కాదని, నైపుణ్యం, క్రమశిక్షణ, అంకితభావం ఉన్నవారే విజయాలు సాధిస్తారని పేర్కొన్నారు. డిసెంబరులో ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా 22 క్రీడాంశాల్లో 29 రాష్ట్రాల క్రీడాకారులతో పోటీలు రాష్ట్రంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు పిల్లలను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని కోరారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతరం సాధన చేస్తే విజయాలు సాధ్యమవుతాయని చెప్పారు. దేవి శరన్నవరాత్రుల శుభాకాంక్షలు తెలిపిన మంత్రి..
జోగులాంబ అమ్మవారి దర్శనానికి వెళ్లిన కారణంగా క్రీడల ప్రారంభ కార్యక్రమానికి హాజరుకాలేకపోయానని వివరించారు.

**వనపర్తిని క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దుతాం**

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఛాంపియన్‌షిప్ కప్ నిర్వహించడం సంతోషకరమన్నారు. వనపర్తి జిల్లా చదువుల పర్తిగానే కాకుండా క్రీడా పర్తిగా కూడా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. క్రీడల శాఖ మంత్రి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ మన ప్రాంతానికి చెందినవారు కావడం గర్వకారణమన్నారు.
జిల్లా క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు క్రీడా పాఠశాల, హాకీ టర్ఫ్ వంటి సదుపాయాలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వనపర్తి అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నారని, రాజా భవనం మరమ్మతుల కోసం రూ.10 కోట్లు కేటాయించడంపై కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు రూ.3,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులు, నిధులు అందించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు చెప్పారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఓటమి ఎదురైనా నిరాశ చెందకుండా మరింత పట్టుదలతో ప్రయత్నించాలని సూచించారు. మారుమూల ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులు తీసుకుంటారని చెప్పారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను భావితరాలకు తెలియజేయాలని పేర్కొన్నారు. వనపర్తిలో పాడి పరిశ్రమ అభివృద్ధికి సహకరించాలని మంత్రిని కోరారు.

**క్రీడాకారులకు కలెక్టర్ అభినందనలు**

ఛాంపియన్‌షిప్ కప్‌లో పాల్గొన్న క్రీడాకారులందరికీ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అభినందనలు తెలిపారు. పోటీల్లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారని పేర్కొన్నారు. విజేతలు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, ఈసారి విజయం సాధించలేకపోయిన వారు వచ్చే ఏడాది మరింత శ్రమించి లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. వచ్చే ఏడాది కూడా పోటీలు నిర్వహిస్తామని, క్రీడాకారులు నిరంతరం సాధన కొనసాగించాలని సూచించారు.

**ఉత్కంఠగా ఫైనల్ పోటీలు**

ముగింపు కార్యక్రమంలో భాగంగా పెబ్బేరు, వీపనగండ్ల జట్ల మధ్య జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్‌ను కలెక్టర్ ఆదర్శ్ సురభి తిలకించారు. అనంతరం పెబ్బేరు జట్టు తరఫున కొద్దిసేపు మైదానంలో ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కొత్తకోట, ఆత్మకూరు జట్ల మధ్య జరిగిన కబడ్డీ ఫైనల్‌తోపాటు వనపర్తి, ఘనపూర్ జట్ల మధ్య జరిగిన తాడు లాగుడు పోటీలను ముఖ్య అతిథులు వీక్షించారు. తాడు లాగుడు పోటీలో వారు కూడా పాల్గొని క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు.

**ఛాంపియన్‌గా వనపర్తి మండలం**

వనపర్తి ఛాంపియన్‌షిప్ కప్2026లో వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచిన జట్ల వివరాలు ఇలా ఉన్నాయి.
వాలీబాల్ మొదటి స్థానం వనపర్తి, రెండో స్థానం ఘనపూర్, మూడో స్థానం కొత్తకోట, నాలుగో స్థానం పెద్దమందడి.
క్రికెట్: మొదటి స్థానం వనపర్తి, రెండో స్థానం పెద్దమందడి, మూడో స్థానం పానగల్, నాలుగో స్థానం ఆత్మకూరు.
ఫుట్‌బాల్: మొదటి స్థానం పెబ్బేరు, రెండో స్థానం వీపనగండ్ల, మూడో స్థానం అమరచింత, నాలుగో స్థానం ఆత్మకూరు.
కబడ్డీ: మొదటి స్థానం ఆత్మకూరు, రెండో స్థానం కొత్తకోట, మూడో స్థానం వీపనగండ్ల, నాలుగో స్థానం శ్రీరంగాపూర్.
చెస్: మొదటి స్థానం వనపర్తికి చెందిన జగదీష్, రెండో స్థానం చిన్నంబావికి చెందిన రవి, మూడో స్థానం గోపాల్‌పేటకు చెందిన జితేందర్, నాలుగో స్థానం ఘనపూర్‌కు చెందిన కార్తీక్.
క్యారమ్స్: మొదటి స్థానం పెబ్బేరు, రెండో స్థానం వనపర్తి, మూడో స్థానం పెద్దమందడి, నాలుగో స్థానం ఏదుల.
తాడు లాగుడు: మొదటి స్థానం ఘనపూర్, రెండో స్థానం వనపర్తి, మూడో స్థానం వీపనగండ్ల, నాలుగో స్థానం చిన్నంబావి.
అన్ని క్రీడాంశాల్లో సాధించిన ఫలితాల ఆధారంగా ఛాంపియన్‌గా నిలిచిన వనపర్తి మండల జట్టుకు ముఖ్య అతిథులు ట్రోఫీ అందజేశారు.

**విజేతలకు నగదు బహుమతులు**

క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ వంటి జట్టు క్రీడల్లో మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు, మూడో, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్లకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. చెస్, క్యారమ్స్, తాడు లాగుడు పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ.3 వేలు, మూడో, నాలుగో స్థానాల్లో నిలిచిన వారికి ఒక్కొక్కరికి రూ.1,500 చొప్పున బహుమతులు అందించారు.

**బతుకమ్మ వేడుకల్లో సందడి**

క్రీడా పోటీల ముగింపు వేడుకలతోపాటు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రంగురంగుల బతుకమ్మలకు ముఖ్య అతిథులు పూజలు నిర్వహించారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మల ప్రదర్శనలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మకు మొదటి బహుమతి లభించింది. గోపాల్‌పేట మండల మహిళా సమాఖ్య రెండో బహుమతి, ఘనపూర్ మండల మహిళా సమాఖ్య మూడో బహుమతి సాధించాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, వనపర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా యువజన, క్రీడల అధికారి సుధీర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చేతుల మీదుగా 'ఆర్కే అదుర్స్' ఐటమ్ సాంగ్ సీడీ ఆవిష్కరణ

- **ఏఐ సాంకేతికతతో మ్యూజిక్ డైరెక్టర్ జయసూర్య ఆధ్వర్యంలో పాట రూపకల్పన**
- **రవీందర్ ఎర్ర సాంగ్స్ యూట్యూబ్ ఛానల్‌లో విడుదల**
- **విభిన్న ప్రక్రియల్లో పాటలు రాస్తూ గుర్తింపు పొందుతున్న పెద్దేముల్ గ్రామానికి చెందిన గేయరచయిత రవీందర్ ఎర్ర**

**పెద్దేముల్, అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

సినిమా రంగంలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ రూపొందించిన పాటలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి.ఈ క్రమంలో 'ఆర్కే అదుర్స్' సినిమా కోసం మ్యూజిక్ డైరెక్టర్ జయసూర్య ఆధ్వర్యంలో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో రూపొందించిన ఐటమ్ సాంగ్ సీడీని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. సినిమా ప్రాజెక్టు నిలిచిపోవడంతో ఈ పాటను ప్రత్యేకంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించినట్లు గేయరచయిత రవీందర్ ఎర్ర తెలిపారు. శనివారం ఈ పాటను రవీందర్ ఎర్ర సాంగ్స్ అనే యూట్యూబ్ ఛానల్ ద్వారా విడుదల చేశారు.'ఆర్కే అదుర్స్' సినిమా కోసం రూపొందించిన ఈ ఐటమ్ సాంగ్‌లో మూడు చరణాలు ఉంటాయని రవీందర్ ఎర్ర వివరించారు.హీరోయిన్ అందచందాలను వర్ణిస్తూ, భావాత్మకమైన పదాలతో సినిమా చిత్రణకు అనుగుణంగా పాటను రచించినట్లు తెలిపారు. పాటలో శృంగారభరిత భావాలను సున్నితంగా వ్యక్తీకరించేలా సాహిత్యాన్ని రూపొందించామని పేర్కొన్నారు.ఏఐ సాంకేతికతను ఉపయోగించి పాటకు రూపకల్పన చేయడం ఈ ప్రాజెక్టులో ప్రత్యేకతగా నిలిచిందన్నారు.తాను ఇప్పటివరకు మ్యూజిక్ డైరెక్టర్ జయసూర్య సంగీత దర్శకత్వంలో సుమారు 10 నుంచి 15 పాటలను యూట్యూబ్ ద్వారా విడుదల చేసినట్లు రవీందర్ ఎర్ర తెలిపారు.వాటిలో 'ఒక్కొక్క మెట్టెక్కి ఒత్తునో అయ్యప్ప' పాట తనకు స్థానికంగా మంచి గుర్తింపు తెచ్చిందని చెప్పారు. ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా విభిన్న అంశాలపై పాటలు రాస్తూ సంగీత ప్రియులకు చేరువవుతున్నట్లు వివరించారు.హిందూ భక్తి గీతాలు, క్రైస్తవ భక్తి గీతాలు, క్రైస్తవ వివాహ గీతాలు, బతుకమ్మ, బోనాల పాటలు, జానపద గేయాలతో పాటు వివిధ ప్రక్రియల్లో పాటలు రచించినట్లు రవీందర్ ఎర్ర తెలిపారు. సందర్భానికి తగిన పదాలతో, ప్రేక్షకుల అభిరుచులను దృష్టిలో ఉంచుకుని గేయాలు రూపొందిస్తూ వాటిని యూట్యూబ్ వేదికగా విడుదల చేస్తున్నానని పేర్కొన్నారు.తాను రచించిన పాటలను ఆదరించాలని రవీందర్ ఎర్ర ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశారు.ప్రేక్షకుల ప్రోత్సాహం లభిస్తే భవిష్యత్తులో మరిన్ని మంచి పాటలు రాసి సంగీత ప్రియులకు అందిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.డిజిటల్ వేదికల ద్వారా తన పాటలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.



# సాంప్రదాయం ఉట్టిపడేలా... ప్రకృతి పులకరించేలా...!

- **- కల్లూరులో ఘనంగా బతుకమ్మ సంబరాలు**
- **- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన సర్పంచ్ రామిరెడ్డి**
- **- పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి**

**కోటగిరి, అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

పోతంగల్ మండలం కల్లూరు గ్రామంలో సర్పంచ్ రామిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు బతుకమ్మ పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల సంప్రదాయ పండుగ అయిన బతుకమ్మ పండుగ కల్లూరులో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రకృతి పులకరించేలా రంగు రంగుల పూలతో బతుకమ్మని పేర్చిన మహిళలు బతుకమ్మపై గౌరమ్మను ప్రతిష్టించి డీజే పాటలకు వేసిన బతుకమ్మ స్టెప్పులు ఆకట్టుకున్నాయి. మహిళలతో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సర్పంచ్ రామిరెడ్డి బతుకమ్మ ఆడి మహిళల్లో ఉత్సాహాన్ని పెంచారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామిరెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఏటా కల్లూరు గ్రామంలో బతుకమ్మ సంబరాలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తామని అన్నారు. గ్రామంలోని మహిళలు పురుషులు పెద్ద ఎత్తున బతుకమ్మ సంబరాల్లో పాల్గొని పండుగను విజయవంతం చేస్తారని అన్నారు. పెద్ద ఎత్తున బతుకమ్మ పండుగ సంబరాల్లో పాల్గొని పండుగను విజయవంతం చేసిన గ్రామ ప్రజలకు బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా వచ్చిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామిరెడ్డి,ఉపసర్పంచ్ దశరథ్, మాజీ జెడ్పి కో ఆప్షన్ మెంబెర్ సిరాజ్, గ్రామ అభివృద్ధికమిటీ అధ్యక్షుడు బాలకృష్ణ, గ్రామ పెద్దలు రవీందర్ రెడ్డి,రాజుపాటిల్,ప్రహ్లాద్ రెడ్డి,లింగప్ప,వెంకట్ రెడ్డి,మక్కయ్య,సాయిలు,గోపాల్ రెడ్డి,నరేష్, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఏటీఎం చోరీకి యత్నం

- **అలారం మోగడంతో పరారైన దుండగులు**

**మొయినాబాద్, అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

మొయినాబాద్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. అక్టోబర్ 16న రాత్రి 11.25 గంటల సమయంలో ఏటీఎంలోని వైర్లను ధ్వంసం చేశారు. అలారం మోగడంతో అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై బ్యాంకు మేనేజర్ వి. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.




# శివగంగ రాజరాజేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక పూజలు

- **దేవి శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారి దర్శనం.. పరమేశ్వరుడికి అభిషేకం.**

**మహేశ్వరం అక్టోబర్17(ప్రజాక్షేత్రం):**



మహేశ్వరం దేవి శరన్నవరాత్రుల సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం గ్రామంలో ఉన్న ప్రాచీన శివగంగ రాజరాజేశ్వరి ఆలయాన్ని మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పరమేశ్వరుడికి ప్రత్యేక అభిషేకం చేసి భక్తిశ్రద్ధలతో స్వామివారి ఆశీస్సులు పొందారు. దేవి శరన్నవరాత్రుల వేళ ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# అమీర్‌పేటలో విద్యుత్ సరఫరా అంతరాయాలతో రైతుల ఆవేదన!



- **పంట పొలాలు ఎండిపోతున్నాయని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లిన రైతులు.**

**మహేశ్వరం అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

మహేశ్వరం నియోజకవర్గంలోని అమీర్‌పేట గ్రామంలో గత కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో రైతులు, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో పంట పొలాలకు సకాలంలో నీరు అందక పచ్చని పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అమీర్‌పేట గ్రామ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి స్వయంగా తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో వ్యవసాయ పనులకు కలుగుతున్న ఇబ్బందులను రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించి, వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలి:ఎంపీడీవో



**నంద్యాల పాములపాడు అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం ):**

రాష్ట్ర ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల నిమిత్తము ఈనెల 19వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు పాములపాడులోని, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఎంఎన్ వి. రాజు ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో ఎన్.చంద్రశేఖర్ విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎన్.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి, వైఎస్ఆర్సిపి, సిపిఐ, సిపిఎం, తదితర పార్టీల మండల నాయకులు పాల్గొని, ఎన్నికల నియమావళిపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

# ప్రజల కష్టాల్లో అండ..

- **ప్రజల కష్టాల్లో అండ..**
- **సేవే నా రాజకీయ బలం!**
- **33 ఉచిత కంటి వైద్య శిబిరాలు..**
- **4,110 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు**
- **ప్రజల ఆశీర్వాదమే నా నిజమైన సంపద**
- **భూక్య జంపన్న ప్రజాసేవా ప్రస్థానం..**

**కన్నాయిగూడెం: అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం)**

ములుగు నియోజకవర్గంలో ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 33వ ఉచిత కంటి వైద్య శిబిరంలో ఎంపికైన వారికి హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రిలో విజయవంతంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఆపరేషన్లు పూర్తయిన అనంతరం ఈరోజు ప్రత్యేక బస్సుల ద్వారా లబ్ధిదారులు తమ స్వగ్రామాలకు చేరుకున్నారు.

ఈ సందర్భంగా జంపన్న వారిని కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కంటి ఆపరేషన్ అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జంపన్న మాట్లాడుతూ.. ఇప్పటివరకు ములుగు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో 33 విడతలుగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, 4,110 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో పేదలు వైద్యానికి దూరం కాకూడదనే సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

రాజకీయమంటే పదవులు, అధికారం మాత్రమే కాదని.. ప్రజల కష్టాల్లో తోడుగా నిలిచి, వారి జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన ప్రజా నాయకత్వమని జంపన్న అన్నారు. పదవులతో సంబంధం లేకుండా ప్రజలకు అండగా ఉండాలనే సంకల్పంతో వైద్యం, విద్య, ఉపాధి రంగాల్లో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజల ఆదరణ, ఆశీర్వాదాలే తనకు అసలైన రాజకీయ బలమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కంటి ఆపరేషన్లు చేయించుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ.. తమలాంటి పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి, ప్రత్యేక బస్సుల ద్వారా స్వగ్రామాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేసిన జంపన్న సేవలను ఎప్పటికీ మరువలేమని అన్నారు. తమ ఇంటి పెద్ద కొడుకులా అండగా నిలిచి, తమ కంటి చూపును తిరిగి పొందేందుకు సహకరించిన ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని భావోద్వేగంతో ఆశీర్వదించారు.

ప్రజల కళ్లలో వెలుగు.. వారి కుటుంబాల్లో ఆనందం.. ఇదే భూక్య జంపన్న ప్రజాసేవా సంకల్పం! అధికారం కోసం కాదు.. ప్రజల ఆదరణ కోసం, ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తూ తన సేవా ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.



# ఘనంగా అన్వర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం!

- **- పీపీఎల్ సీజన్–7 పోటీలను ప్రారంభించిన పెద్దేముల్ సర్పంచ్ డివై.నర్సింహులు**
- **ఉపసర్పంచ్ డివై.ప్రసాద్, పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్**
- **రెండు రోజుల పాటు క్రికెట్ పోటీలు**
- **విజేతలకు ట్రోఫీలు.. ఉత్తమ ఆటగాళ్లకు ప్రత్యేక పురస్కారాలు**

**పెద్దేముల్, అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ,గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రికెట్ ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో పెద్దేముల్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న అన్వర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పీపీఎల్ సీజన్-7 శనివారం ఘనంగా ప్రారంభమైంది. పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై.నర్సింహులు, ఉపసర్పంచ్ డివై.ప్రసాద్,పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ లు ముఖ్య అతిథులుగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నారు.పెద్దేముల్ గ్రామానికి చెందిన క్రికెట్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో వివిధ జట్లు పాల్గొని తమ ప్రతిభను చాటుకునేందుకు సిద్ధమయ్యాయి.ఈ సందర్భంగా పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై.నర్సింహులు, ఉపసర్పంచ్ డివై. ప్రసాద్,పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ లు మాట్లాడుతూ.. క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, ఐకమత్యం, జట్టుగా పనిచేసే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఇలాంటి పోటీలు మంచి వేదికగా నిలుస్తాయని అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు. అన్వర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణతో పెద్దేముల్‌లో క్రీడా సందడి నెలకొంది. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలను తిలకించేందుకు క్రికెట్ అభిమానులు ఆసక్తి చూపుతున్నారు. గ్రామీణ యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పీపీఎల్ సీజన్-7 దోహదపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అన్వర్ కుటుంబ సభ్యులు బాబర్, సద్దాం, ఇక్రమ్,పెద్దేముల్ మండల సీనియర్ జర్నలిస్టులు గౌస్, గుడిసె శ్రీనివాస్,పెద్దేముల్ గ్రామ క్రికెట్ క్రీడాకారులు, ఆయా క్రికెట్ జట్ల క్రీడాకారులు, గ్రామస్తులు, టోర్నమెంట్ ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.



# పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలి

- **- అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలి**
- **ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి**



**మహబూబ్‌నగర్ అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) పిలుపునిచ్చారు. ప్రతి ఓటు కీలకమేనని, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో వేగవంతం చేయాలని సూచించారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల సమగ్ర సన్నాహక సమావేశంలో జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు,వాకిటి శ్రీహరి, హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ సామ రామ్మోహన్ రెడ్డి, సహచర ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందాలంటే ముందుగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారి ఎన్రోల్మెంట్ ప్రక్రియను వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో సుమారు 55 శాతం ఓట్లు మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఉన్నాయని, అందువల్ల ఈ ఎన్నికల్లో జిల్లా కాంగ్రెస్ శ్రేణుల పాత్ర అత్యంత కీలకమని జీఎంఆర్ పేర్కొన్నారు.

ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ఎమ్మెల్సీ ఎన్నికలను బాధ్యతగా తీసుకొని పట్టభద్ర ఓటర్లను వ్యక్తిగతంగా కలవాలని సూచించారు. ఓటరు జాబితాను పరిశీలించడంతో పాటు అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి గారి గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని జీఎంఆర్ పిలుపునిచ్చారు. ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు కూడగట్టేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా ముందుకు సాగితే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని జీఎంఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మూడో స్థానానికి పరిమితం అవుతుందని ఆయన పేర్కొన్నారు.

**ప్రతి ఓటు కీలకమే**

పట్టభద్రుల ఓటరు నమోదు నుంచి ఎన్నికల వరకు ప్రతి దశను బాధ్యతగా తీసుకొని పని చేయాలని, అర్హత ఉన్న ఒక్క పట్టభద్రుడు కూడా ఓటు హక్కుకు దూరం కాకుండా చూడాలని ఎమ్మెల్యే జీఎంఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యువకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ మధురానగర్‌లో కూల్చివేతలు.. అడ్డుకున్న నాయకులు,స్థానికులు

**శంషాబాద్ అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

శంషాబాద్ పట్టణంలోని మధురానగర్‌లో జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టిన ఇళ్ల కూల్చివేతలు ఉద్రిక్తతకు దారితీశాయి. అధికారుల చర్యలపై స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూ కూల్చివేతలను అడ్డుకున్నారు. వారికి మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అక్కడికి చేరుకుని ప్రజలకు అండగా నిలిచారు.స్థానికుల హక్కులను గౌరవిస్తూ, చట్టబద్ధమైన విధానాలను అనుసరించిన తర్వాతే ఎలాంటి చర్యలైనా చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్నామని చెబుతున్న తమపై ఇప్పుడు కూల్చివేతలు చేపట్టడం ఏమిటని స్థానికులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ 118వ డివిజన్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. శంషాబాద్‌లో అభివృద్ధికి తాము అడ్డంకి కాదని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ హయాంలో అనుమతులు పొందడం తప్పా? అన్ని అనుమతులతోనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టామని, ఇప్పుడు హుటాహుటిన కూల్చివేతలు చేపడితే తాము ఎక్కడికి వెళ్లాలని ఆయన ప్రశ్నించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వారి ఇళ్లకు సంబంధించిన అనుమతులు, ఇతర పత్రాలను పరిశీలించి చట్ట ప్రకారం వ్యవహరించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. కూల్చివేతల విషయంలో అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, బాధితుల సమస్యలను పరిష్కరించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధురానగర్‌లో చోటు చేసుకున్న ఈ ఘటనతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



# రంగారెడ్డి జిల్లాలో ఈఎస్ఐ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించాలి

- **ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్.**

**శంషాబాద్ అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**



రంగారెడ్డి జిల్లాలో మల్టీ స్పెషాలిటీ ఈఎస్ఐ ఆసుపత్రిని మంజూరు చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. శంషాబాద్ టౌన్ లోన్.లో జరిగిన ఏఐటీయూసీ జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు జిల్లాలో లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారు ఏదైనా సమస్య వస్తే సనాతన లేదా నాచారం వెళ్లి చూయించుకోవాల్సిన దుస్థితి ఉందని ఆయన తెలిపారు.ప్రభుత్వాలకు కార్మికుల ఓట్లు కావాలి కానీ వారి పరిస్థితిలో పట్టవా అని ఆయన ప్రజాప్రతినిధులను నిలదీశారు. పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు సాఫ్వేర్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని ఉద్యోగ భద్రత లేదని ఆయన అన్నారు. రాబోయే కాలంలో కార్మిక హక్కుల కోసం కనీస వేతనాలు అమలు కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహించాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు వడ్ల సత్యనారాయణ, అధ్యక్షత వహించారు ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు కే రామస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి దత్తు నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పబ్బతి లక్ష్మణ్, తుపాకుల రాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# తట్టేపల్లిలో బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పరామర్శ

- **ఇటీవల మృతి చెందిన నలుగురి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి**
- **కష్టకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా**
- **తట్టేపల్లి గ్రామంలో పరామర్శించిన ఎమ్మెల్యే**

**పెద్దేముల్, అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

పెద్దేముల్ మండల పరిధిలోని తట్టేపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన మ్యాతరి నర్సమ్మ, మాజీ ఎంపీటీసీ బ్యాగరి అంజప్ప, సానియా, కల్కోడి అనంతప్ప కుటుంబాలను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శనివారం పరామర్శించారు. వారి నివాసాలకు వెళ్లిన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే, వారి కుటుంబాలు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆప్తులను కోల్పోవడం తీరని లోటని పేర్కొంటూ, ఈ కష్టకాలంలో ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. గ్రామ ప్రజలు, స్థానిక నాయకులతో కలిసి మృతుల చిత్రపటాలకు నివాళులర్పించిన ఎమ్మెల్యే, కుటుంబాలకు మనోధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాల విషయంలో ప్రభుత్వం తరపున తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, తట్టేపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# రోహిత్ రెడ్డి పై దుష్ప్రచారం చేస్తే ఊరుకోం

- **నోటీసులపై డీఎస్పీకి ఫిర్యాదు.**

**తాండూర్, అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ నోటీసులు జారీ చేసిందంటూ కృత్రిమ మేధస్సు (ఏఐ) సాయంతో నకిలీ నోటీసులను సృష్టించి, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు తాండూర్ డీఎస్పీకి శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. తాండూర్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి రోజురోజుకు పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే కొందరు కాంగ్రెస్ నాయకులు ఇలాంటి తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కోలేక నకిలీ నోటీసులను సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి చర్యలు రాజకీయ విలువలకు విరుద్ధమని, ప్రజల్లో అపోహలు సృష్టించడమే లక్ష్యంగా ఈ ప్రచారం సాగుతోందని విమర్శించారు.ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ నకిలీ పత్రాలను సృష్టించడం, వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేయడం తీవ్రమైన విషయమని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. నకిలీ నోటీసులను సృష్టించిన వారితో పాటు వాటిని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వారిని గుర్తించి,చట్టా ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ఈ వ్యవహారంపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, నకిలీ నోటీసుల వెనుక ఉన్నవారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.





## దర్గాగా ప్రభుత్వ భూమి కబ్జాయత్నాలు

- **రోడ్డుకు ఆనుకొని ఉన్న భూమిని మట్టితో నింపుతున్న అక్రమార్కులు**

**శంషాబాద్ అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం)**

మండల పరిధిలోని అమ్మపల్లి రెవెన్యూలో సర్వేనెంబర్ 19 లో ప్రభుత్వ భూముల ఆక్రమణల పర్వం జోరుగా కొనసాగుతున్నది. నిషేధిత జాబితాలో ఉన్న సw ర్ప్లస్ సీలింగ్ భూములను కొంతమంది అక్రమార్కులు అదేపనిగా కబ్జా చేస్తున్నారు. తాజాగా శంషాబాద్ షాబాద్ ప్రధాన రహదారి పద్మావతి ఫంక్షన్ హాల్ ఎదురుగా సర్వేనెంబర్ 19 ప్రభుత్వ భూమి కబ్జాయత్నాలు మొదలయ్యాయి. అక్కడ ప్రభుత్వ భూమిలో నిర్మించిన అనధికార వెంచర్ ప్రహరీ గోడ ముందు భాగం లో కబ్జా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అక్కడ గుర్తు తెలియని వ్యక్తులు ఆ భూమిలో మట్టి కుప్పలు పోశారు. కొంత భాగం ఇప్పటికే చదును చేశారు. అధికారులు చూసి చూడనట్లుగా ఉండడంతో రాత్రికి రాత్రి మట్టితో పూడ్చి నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేస్తున్నారు. సదరన్ హోమ్స్ సమీప నుంచి నర్కూడ గ్రామం వైపు సర్వే నెంబర్ 19 లో ఈ అక్రమాల జోరు కొనసాగుతున్నది. ఇప్పటికైనా అధికారులు వెంటనే చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

- **కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు బుయ్యని శ్రీనివాస్ గౌడ్**

**చేవెళ్ల, అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బుయ్యని శ్రీనివాస్ గౌడ్ ఆకాంక్షించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని చేవెళ్ల మండలం గుండాల గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారిని ఆయన గుండాల సర్పంచ్ బుచ్చిరెడ్డి, శ్రీరామ్ రెడ్డితో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.... దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. అమ్మవారి కృపతో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండాల పీఏసీఎస్ చైర్మన్ బిక్షపతి, మాజీ సర్పంచ్ గణేష్, పీఏసీఎస్ డైరెక్టర్ గణేష్ గౌడ్, నాయకులు, అమ్మవారి భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## క్రికెట్ పిచ్‌పై ముథోల్ ముద్దుబిడ్డ సంచలనం..

- **అండర్-14 క్రికెట్ టోర్నీలో విజేతగా నిలిచిన గైక్వాడ్ ప్రథమేష్**

**నిర్మల్ జిల్లా అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

ముథోల్, గ్రామీణ ప్రాంతాల నుంచి అద్భుతమైన క్రీడా ఆణిముత్యాలు వెలుగులోకి వస్తున్నారు. పట్టుదల, క్రమశిక్షణ ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని నిరూపించాడు నిర్మల్ జిల్లాకు చెందిన వర్ధమాన క్రీడాకారుడు. ముథోల్‌కు చెందిన గైక్వాడ్ ప్రథమేష్ అండర్14 క్రికెట్ విభాగంలో సంచలన ఆటతీరుతో అదరగొట్టి, విజేతగా నిలిచాడు. స్థానిక గరుడ క్రికెట్ అకాడమీ తరపున బరిలోకి దిగిన ప్రథమేష్, టోర్నమెంట్‌లో ఆద్యంతం అత్యుత్తమ ప్రతిభను కనబరిచి అందరి దృష్టిని ఆకర్షించాడు. శుక్రవారం జరిగిన కీలక పోరులో అసాధారణ నైపుణ్యంతో రాణించి, జట్టును విజయతీరాలకు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు.

**చిన్న వయసులోనే అసాధారణ నైపుణ్యం..**

ప్రథమేష్ చిన్న వయసు నుంచే క్రికెట్ పట్ల ఎనలేని ఆసక్తిని కనబరిచేవాడని స్థానికులు చెబుతున్నారు. మైదానంలోకి దిగితే పరుగుల వరద పారించడం, తనదైన వ్యూహాలతో ప్రత్యర్థి జట్టును కట్టడి చేయడం ఇతని ప్రత్యేకత. ఈ టోర్నీలో ఒత్తిడిని అధిగమిస్తూ ప్రథమేష్ ప్రదర్శించిన పరిణతి చెందిన ఆటతీరు క్రీడా విశ్లేషకులను సైతం ఎంతగానో ఆకట్టుకుంది.

**క్రీడాభిమానుల హర్షా తిరేకాలు.. ప్రముఖుల అభినందనలు**

ముథోల్ యువకుడు అండర్14 విభాగంలో ఘన విజయం సాధించడంతో స్థానిక క్రీడాకారులు, అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ముథోల్ ప్రాంత కీర్తిని క్రీడా ప్రపంచంలో చాటిచెప్పిన ప్రథమేష్‌ను పలువురు రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో అతను మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, రాష్ట్ర మరియు జాతీయ స్థాయిల్లో ఆడి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



## రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

- **బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గం నియామకం**
- **చిన్నారి హన్వికను పరామర్శించిన పార్టీ నాయకులు**

**వనపర్తి, అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతోపాటు రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని పార్టీ నాయకులు నూతనంగా నియమితులైన కిసాన్ మోర్చా జిల్లా కమిటీ సభ్యులకు జిల్లా పార్టీ అధ్యక్షులు డి నారాయణ, బిజెపి రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి సూచించారు. వనపర్తి జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాకాసి అరవింద్‌రెడ్డి పూర్తిస్థాయి జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, రాష్ట్ర నాయకుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి తదితరుల సమక్షంలో నియామకాలు చేపట్టారు.

**కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గం**

జిల్లా ఉపాధ్యక్షులుగా జ్ఞానేశ్వర్, రాకేష్‌రెడ్డి, వెంకట నరసింహారెడ్డి, జంబులయ్యలను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా ఓం ప్రకాశ్ చారి, విటల్‌రెడ్డి, కార్యదర్శులుగా ఈదమ్మ, అశోక్‌రెడ్డి, యాదగిరి, నరసింహనాయుడులకు బాధ్యతలు అప్పగించారు. జిల్లా అధికార ప్రతినిధిగా ఏర్పుల తిరుపతయ్యను నియమించారు. ముఖ్య నాయకులుగా నాగేశ్వరరావు, వెంకటాచలం, వెంకటేష్, రాజు, లక్ష్మీనారాయణ, లోడుగు శివ తదితరులను ఎంపిక చేశారు. మండలాల వారీగా కిసాన్ మోర్చా అధ్యక్షులుగా శ్రీరంగాపురానికి శివయ్య, పెద్దమందడికి రవీందర్, రేవల్లికి జగదీశ్వర్‌రెడ్డి, ఏదులకు లింగం, వనపర్తికి రాములు, ఖిల్లాఘనపురానికి మాసయ్యలను ప్రకటించారు.

**రైతుల పక్షాన పోరాడాలి**

పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నిబద్ధతతో పని చేయాలని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు సూచించారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులకు అండగా నిలుస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు మున్నూరు రవీందర్, సుబ్బిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాకాసి లోకనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పురుషోత్తంరెడ్డి, రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షురాలు అనుజ్ఞారెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగం కన్వీనర్ బాశెట్టి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు, కల్పన, సీనియర్ నాయకుడు కుమారస్వామి, జిల్లా కార్యదర్శి మనివర్ధన్ సాగర్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు అరవింద్, దళిత మోర్చా అధ్యక్షుడు ప్రవీణ్, గిరిజన మోర్చా అధ్యక్షుడు రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

**చిన్నారి హన్వికకు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి పరామర్శ**

ఇదిలా ఉండగా, తీవ్ర జ్వరంతో బాధపడి చికిత్స అనంతరం కోలుకున్న చిన్నారి హన్వికను బీజేపీ నాయకుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. వనపర్తికి చెందిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జర్నలిస్టు యూనియన్ పట్టణ అధ్యక్షుడు, ప్రజాజ్యోతి, కలం డైలీ పత్రికల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ తైలం అరుణ్‌రాజ్ కుమార్తె హన్విక నివాసానికి శనివారం వెళ్లి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారిని ఆప్యాయంగా పలకరించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. హన్విక సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్బిరెడ్డి వెంకటరెడ్డి, కేతూరి బుడ్డన్న, పార్టీ కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా కార్యదర్శి మనివర్ధన్ సాగర్, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేశ్, జిల్లా వాణిజ్య విభాగం కన్వీనర్ కొండోజు గోపీనాథ్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ఓం ప్రకాశ్ చారి తదితరులు పాల్గొన్నారు.





## విద్య, ఉద్యోగుల హక్కులకు ప్రాధాన్యమివ్వాలి

- **నీట్‌లో ప్రతిభ చూపిన కేశవకుమార్‌కు నిరంజన్‌రెడ్డి అభినందనలు**
- **ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తా**

**వనపర్తి, అక్టోబరు 17(ప్రజాక్షేత్రం):**

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడంతోపాటు ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. పెబ్బేరు పట్టణానికి చెందిన మహేష్ కుమారుడు కేశవకుమార్ ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి సీఎంఆర్ఎం కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా శనివారం ఆయనను సన్మానించి అభినందించారు. వైద్య విద్యలో ఉన్నతంగా రాణించి భవిష్యత్తులో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

**ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు సంఘీభావం**

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెగ్యులరైజేషన్ కోరుతూ ఉద్యోగులు చేపట్టిన ధర్నా శిబిరాన్ని సందర్శించి వారి ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించే దిశగా మంత్రివర్గ ఆమోదంతో ఉత్తర్వులు తీసుకురావడానికి ప్రయత్నించిందని, అయితే కాంగ్రెస్ నాయకులు కోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియకు ఆటంకం ఏర్పడిందని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం విధానంతో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల గౌరవ వేతనాలను పెంచి వారి ఆత్మగౌరవాన్ని కాపాడిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. గతంలో తాను న్యాయవాదిగా కాంట్రాక్టు ఉద్యోగుల హక్కుల కోసం పోరాడానని, న్యాయపోరాటం ద్వారానే ఉద్యోగులకు న్యాయం సాధ్యమవుతుందని అన్నారు.
ఉద్యోగుల డిమాండ్లలోని న్యాయబద్ధతను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని సూచించారు.
కేంద్ర ప్రభుత్వ నిబంధనలను పరిగణనలోకి తీసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు.
తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సాధ్యాసాధ్యాలను పరిశీలించి, చట్టపరిధిలో ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల హక్కుల సాధనకు అవసరమైన న్యాయ సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.

**శిబిరంలో పారిశుద్ధ్యంపై ఆరా**

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ధర్నా చేస్తున్న శిబిరం వద్ద అపరిశుభ్రత నెలకొనడం, మహిళా ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటుండటాన్ని నిరంజన్‌రెడ్డి గమనించారు. వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి శిబిరం పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, మహిళా ఉద్యోగులకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, చంద్రశేఖర్ నాయక్, గంధం పరంజ్యోతి, ఉంగ్లం తిరుమల్, నాగన్న యాదవ్, పోతులపల్లి రాజు, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, సునీల్ వాల్మీకి, మంద రాము, సయ్యద్ జమీల్, కుమార్, ముద్దుసార్, అలీం తదితరులు పాల్గొన్నారు.



## గ్రామం కోసం చెమటోడ్చిన ఇందూరు సర్పంచ్ వెంకట్ ముదిరాజ్....తోడుగా యువత

- **ఇందూరులో సర్పంచ్ వెంకట్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు**
- **మురుగు కాలువల్లో చెత్త తొలగింపు.. ప్రధాన రహదారుల శుభ్రత**
- **గ్రామ పరిశుభ్రతలో భాగస్వాములైన వార్డు సభ్యులు, యువకులు**

**పెద్దేముల్, అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా ఇందూరు గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.పెద్దేముల్ మండల పరిధిలోని ఇందూరు గ్రామంలో సర్పంచ్ వెంకట్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గ్రామ వార్డు సభ్యులు, యువకులు కలిసికట్టుగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు.గ్రామంలోని పలు కాలనీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు మురుగు కాలువలను శుభ్రం చేశారు.ప్రధాన కాలనీల్లోని రహదారులను స్వయంగా ఊడ్చి పరిశుభ్రంగా మార్చేందుకు శ్రమించారు.గ్రామంలో అపరిశుభ్రత కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.మురుగు కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం ద్వారా మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. రహదారులపై చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేస్తూ పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేశారు.గ్రామాభివృద్ధిలో పారిశుద్ధ్యం కీలక పాత్ర పోషిస్తుందని,గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇందూరు గ్రామ సర్పంచ్ వెంకట్ ముదిరాజ్ తో పాటు పలువురు పేర్కొన్నారు.గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శ్రమదానంలో పాల్గొనడం గ్రామస్తులకు ఆదర్శంగా నిలిచింది.ప్రజలు తమ పరిసరాల్లో చెత్తను వేయకుండా, మురుగు కాలువల్లో వ్యర్థాలను పడేయకుండా సహకరించాలని సూచించారు.గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ, పరిశుభ్రమైన ఇందూరును తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు కూడా పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగస్వాములైతే ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఇందూరు గ్రామ వార్డు సభ్యులు ముక్తార్, అహ్మద్, నరేష్, సుకుమార్, మహేందర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, నర్సింహులు, ఇస్మాయిల్, సామెల్, శాంత్ కుమార్, సురేష్, నయీమ్, పాండు, ఖదీర్, మాసూమ్, జనార్ధన్, కారోబార్ బందెప్ప, తదితరులు పాల్గొన్నారు.





## స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**శంషాబాద్ అక్టోబర్ 17(ప్రత్యక్షేత్రం):**

ఏడో రోజు విద్యాలక్ష్మీ దేవిగా అమ్మవారి దివ్య దర్శనం భక్తిశ్రద్ధలతో విశేషంగా నిర్వహించిన హయగ్రీవేష్టి హైదరాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో 'స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ'లో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో కొనసాగుతున్నాయి. మేరకు ఈ ఉత్సవాలు కన్నులపండువగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శరన్నవరాత్రి మహోత్సవాలలో ఏడో రోజైన శనివారం అమ్మవారు విద్యాప్రదాయిని అయిన విద్యాలక్ష్మీ దేవిగా భక్తులకు అభయమిస్తూ దివ్యదర్శనం ప్రసాదించారు. జ్ఞానాన్ని, సకల విద్యలను ప్రసాదించే విద్యాలక్ష్మీ స్వరూపిణిని దర్శించుకునారు ఈ పవిత్రమైన రోజున ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి అత్యంత నిష్టతో, శాస్త్రోక్తంగా హయగ్రీవేష్టి కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. వేద పండితులు, రుత్వికుల మంత్రోచ్ఛారణలు, వేదనాదాల మధ్య జరిగిన ఈ పూజా కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అమ్మవారి నామస్మరణతో ముచ్చింతల్ క్షేత్రమంతా మార్మోగింది.
అక్టోబర్ 18 - ధైర్య లక్ష్మీ అలంకరణ నారసింహ ఇష్టి జరుగును.



## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

- **గ్రామ సర్పంచ్ పృధ్వి.**

**వలిగొండ అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోపరాజు పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ సలిగంజి పృథ్వి, గ్రామ పరిపాలన అధికారి పరుశురాం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పృధ్వి మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సరుకులను మరింత సులభంగా అందించే విధంగా ప్రభుత్వం స్మార్ట్ కార్డులను అమలు చేసిందని అన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోలబోయిన లింగస్వామి, రేషన్ డీలర్ వల్లమల్ల రత్నయ్య, వార్డ్ మెంబర్స్ పాలకూర్ల బాలమ్మ, గాజుల లక్ష్మమ్మ, నీలం నరేష్, మేడి కుమార్, లబ్ధిదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# బియ్యం కొరతా? దళారుల దోపిడీనా?

- గోదాముల్లో ధాన్యం.. సామాన్యుడి కంచంలో ధరల మంట!
- నిల్వల లెక్కలేవి? సరఫరాపై పర్యవేక్షణ ఏది?
- తెలంగాణ నుంచి వికారాబాద్ వరకు బియ్యం ధరలపై సమగ్ర విచారణ జరగాలి!

**వికారాబాద్ బ్యూరో అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

పంట పండిస్తున్న రైతు ఒకవైపు.. బియ్యం కొనలేక భారం మోస్తున్న వినియోగదారుడు మరోవైపు! మధ్యలో అసలు లాభపడుతున్నదెవరు?

అన్నం ప్రతి మనిషి కనీస అవసరం. అలాంటి బియ్యం ధరలు పెరిగి సామాన్యుడి నెలవారీ బడ్జెట్‌ను చిదిమేస్తుంటే ప్రభుత్వాలు ప్రేక్షకపాత్ర పోషించడం ఎంతవరకు సమంజసం? ఒకవైపు రాష్ట్రంలో వరి సాగు, ధాన్యం సేకరణ భారీ స్థాయిలో జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. మరోవైపు మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు వినియోగదారులకు భారంగా మారుతున్నాయి. మరి ధాన్యం పుష్కలంగా పండుతున్న రాష్ట్రంలో బియ్యం ధరలు ఎందుకు అదుపులో ఉండటం లేదు? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే!

**ధాన్యం పుష్కలం.. మరి ధరల మంట ఎందుకు?**

తెలంగాణలో ధాన్యం సేకరణ జరుగుతోంది. కొనుగోలు కేంద్రాలు పనిచేస్తున్నాయి. మిల్లులకు ధాన్యం చేరుతోంది. ప్రభుత్వానికి బియ్యం అప్పగింతలు జరుగుతున్నాయి. అయినా మార్కెట్‌లో ధరల పెరుగుదలపై వినియోగదారులకు స్పష్టత లేదు. రాష్ట్రంలో ఎంత ధాన్యం కొనుగోలు చేశారు? ఎంత మిల్లింగ్ పూర్తయింది? ప్రభుత్వ గోదాముల్లో ఎంత బియ్యం ఉంది? ప్రైవేటు వ్యాపారుల వద్ద ఎంత నిల్వ ఉంది? బహిరంగ మార్కెట్‌లోకి రోజుకు ఎంత సరుకు వస్తోంది? ఈ వివరాలు ప్రజలకు అందుబాటులో లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**నిల్వలు ఉన్నాయా? లేవా? ప్రభుత్వం లెక్కలు చెప్పాలి!**

ధాన్యం ఉత్పత్తి ఎక్కువగా ఉందని చెప్పడం మాత్రమే సరిపోదు. ఉత్పత్తి నుంచి వినియోగదారుడి చేతికి బియ్యం చేరే వరకు ప్రతి దశలో ఏం జరుగుతుందో ప్రభుత్వం వెల్లడించాలి. ధాన్యం కొనుగోలు గణాంకాలు ఒకచోట, మిల్లింగ్ వివరాలు మరోచోట, గోదాముల నిల్వలు ఇంకోచోట ఉంటే ప్రజలకు వాస్తవ పరిస్థితి ఎలా తెలుస్తుంది?

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సమగ్ర నిల్వల నివేదికను విడుదల చేయాలి. కేంద్రానికి అప్పగించిన బియ్యం, రేషన్ పంపిణీ, ప్రభుత్వ నిల్వలు, ప్రైవేటు మార్కెట్ సరఫరా వివరాలను స్పష్టంగా వెల్లడించాలి. లెక్కలు బయటపెడితేనే కొరత నిజమో, సరఫరా సమస్యో, మార్కెట్ నిర్వహణలో లోపమో తెలుతుంది.

**దళారుల దందా ఉంటే ఉపేక్ష ఎందుకు?**

బియ్యం ధరల పెరుగుదల వెనుక వ్యాపారుల సిండికేట్‌లు ఉన్నాయనే ఆరోపణలు వస్తే ప్రభుత్వం వాటిని తేలిగ్గా తీసుకోకూడదు. అయితే ఆరోపణను నిజమని ప్రకటించడం కాదు; నిజానిజాలను నిష్పాక్షికంగా నిర్ధారించడం ప్రభుత్వ బాధ్యత.

పెద్ద వ్యాపారులు అవసరానికి మించి నిల్వలు ఉంచుతున్నారా? మిల్లుల్లో తయారైన బియ్యం మార్కెట్‌లోకి రావడం ఎందుకు ఆలస్యమవుతోంది? ఒకే రకం బియ్యం ధరలు ప్రాంతాలవారీగా ఎందుకు మారుతున్నాయి? టోకు ధరలు, చిల్లర ధరల మధ్య వ్యత్యాసం ఎంత? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలు ఆధారాలతో నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

**వికారాబాద్ జిల్లాలోనూ అసలు లెక్కలు తేలాలి!**

వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోళ్లు, మిల్లింగ్, నిల్వలు, బియ్యం పంపిణీపై ప్రత్యేక పరిశీలన జరగాలి. ఎన్ని కొనుగోలు కేంద్రాలు పని చేస్తున్నాయి? ఇప్పటివరకు ఎంత ధాన్యం



సేకరించారు? ఎంత మిల్లింగ్ పూర్తయింది? మిల్లుల్లో ఎంత నిల్వ ఉంది? రేషన్ దుకాణాలకు ఎంత బియ్యం చేరింది? బహిరంగ మార్కెట్‌లో సాధారణ, సన్న బియ్యం ధరలు ఎంత ఉన్నాయి?

ఇవి కేవలం అధికారుల కార్యాలయాల్లో ఉండాల్సిన లెక్కలు కావు. ప్రజలకు జవాబుదారీతనాన్ని నిర్ధారించే వివరాలు. జిల్లాలోని ప్రతి మండలంలో ధరలను నమోదు చేసి, గత నెలతో పోల్చి, ధరల పెరుగుదలకు కారణాలను గుర్తించాలి. అవసరమైతే ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. తప్పు చేసినవారిపై చర్యలు తీసుకోవాలి.

**ప్రభుత్వాలు మేల్కొనకపోతే భారం ప్రజలపైనే!**

ధరలు పెరిగిన తర్వాత సమీక్షలు నిర్వహించడం కాదు.. ధరలు పెరగకముందే మార్కెట్‌పై నిఘా పెట్టడం ముఖ్యం. బియ్యం సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే గుర్తించాలి. అవసరమైన చోట ప్రభుత్వ నిల్వలను బహిరంగ మార్కెట్‌లో విడుదల చేసే అవకాశాలను పరిశీలించాలి. అక్రమ నిల్వలను అరికట్టాలి. ధరల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అదే సమయంలో రైతుకు గిట్టుబాటు ధర దక్కాలి. మిల్లింగ్ ప్రక్రియ సక్రమంగా సాగాలి. వినియోగదారుడికి సరసమైన ధరకు బియ్యం అందాలి. రైతు నష్టపోయి, వినియోగదారుడు భారం మోసి, మధ్యవర్తులు మాత్రమే లాభపడే పరిస్థితి ఏర్పడితే అది మార్కెట్ వ్యవస్థలోని లోపాలను సూచిస్తుంది. అలాంటి లోపాలను గుర్తించి సరిదిద్దడం ప్రభుత్వాల కర్తవ్యం.

**ప్రజలకు కావాల్సింది ప్రకటనలు కాదు.. పారదర్శకత!**

లెంగాణలో బియ్యం కొరత ఉందా లేదా అన్నది రాజకీయ ప్రకటనలతో తేలే అంశం కాదు. నిల్వలు, సరఫరా, కొనుగోళ్లు, ధరలు, తనిఖీల గణాంకాలే నిజాన్ని వెల్లడించాలి. వికారాబాద్ జిల్లా సహా ప్రతి జిల్లాలో వాస్తవ పరిస్థితిని ప్రభుత్వం ప్రజల ముందుంచాలి.

అన్నం పండించే రైతుకు గౌరవం ఉండాలి. అన్నం కొనుగోలు చేసే సామాన్యుడికి భారం ఉండకూడదు. ఈ రెండింటి మధ్య న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. గోదాముల్లో ఎంత బియ్యం ఉందో చెప్పలేని పాలన, మార్కెట్‌లో ధరలు ఎందుకు పెరుగుతున్నాయో వివరించలేని వ్యవస్థ ప్రజల విశ్వాసాన్ని ఎలా పొందగలదు? ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొనాలి. బియ్యం నిల్వలపై శ్వేతపత్రం విడుదల చేయాలి. ధరల పెరుగుదలపై సమగ్ర విచారణ జరపాలి. అక్రమాలు ఉంటే అరికట్టాలి. సామాన్యుడి కంచంలో అన్నం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఎందుకంటే ఆకలి రాజకీయ ప్రకటనలతో తీరదు.. పారదర్శకమైన పాలనతోనే తీరుతుంది!

## సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఎండీ అతిఫ్

- నియామక ఉత్తర్వులు అందజేసిన నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

**సిద్దిపేట, ప్రజాక్షేత్రం**

సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఎండీ అతిఫ్ నియమితులయ్యారు. రాష్ట్ర మైనారిటీ సెల్ చైర్మన్ ఇర్ఫాన్ అలీ, సిద్దిపేట జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు రషద్ ఈ నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ చేతుల మీదుగా జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు రషద్ నూతన అధ్యక్షుడు ఎండీ అతిఫ్‌కు నియామక ఉత్తర్వుల ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు ఎండీ అతిఫ్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన నాయకత్వంలో మైనారిటీ సెల్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

పార్టీ బలోపేతానికి, మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి, డీసీసీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, డీసీసీ ఉపాధ్యక్షుడు చాంద్ పాషా, షాబుద్దీన్, వాహబ్, అజ్మత్, జనార్దన్ రెడ్డి, ప్రభాకర్, పాత కోటి రమేష్, దస్తగిరి, షన్నా, అన్సార్, ఆసిఫ్, ఫిరోజ్, ఫారూఖ్, ఫైసల్ తదితరులు పాల్గొన్నారు.




## స్థానిక సంస్థల ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్‌గా రాథోడ్ రమేష్ బాధ్యతల స్వీకరణ

**నిర్మల్ ప్రజాక్షేత్రం**

నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్‌గా రాథోడ్ రమేష్ శనివారం సాయంత్రం కలెక్టరేట్ లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌కు చెందిన పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



## ఇంకుడు గుంతల నిర్మాణం మరియు ఎస్టిమేట్ల తయారీ

**సోనాల మండలం ప్రజాక్షేత్రం**

వి బి జి రామ్ జి సిబ్బందికి అత్యంత ముఖ్యమైన గమనిక ఇంకుడు గుంతల నిర్మాణం మరియు ఎస్టిమేట్ల తయారీ గురించి. మన జిల్లాలో ఇంకుడు గుంతల నిర్మాణం మరియు ఎస్టిమేట్ల తయారీ సంఖ్య చాలా తక్కువగా ఉండటం వల్ల రాష్ట్ర స్థాయిలో మన జిల్లా పురోగతి వెనుకబడి ఉంది. కావున, ఈ విషయంపై సంబంధిత సిబ్బంది అందరికీ ఆదేశాలు జారీ చేయడమైనది. ప్రతి గ్రామంలో కనీసం 20 ఇంకుడు గుంతలకు తగ్గకుండా ఎస్టిమేట్లు సిద్ధం చేసి, వాటికి శాంక్షన్ పొందేలా చర్యలు తీసుకోవాలి.

ఈ పనిని అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో సోనాల ఎంపీడీవో ప్రతాకర్ రావు గ్రామస్తులు పాల్గొన్నారు .

**డి ఆర్ డి ఓ**

**డి ఆర్ డి ఏ – ఆదిలాబాద్**



## డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. వినోద్ జాదవ్‌కు ఘన సన్మానం

**ప్రజాక్షేత్రం గుడిహత్నూర్ :**

డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిప్యూటీ డీఎంహెచ్ఓ)గా పదోన్నతి పొందిన డా. వినోద్ జాదవ్‌ను బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యానారాయణతో కలిసి గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో డా. వినోద్ జాదవ్ చేస్తున్న కృషి అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. వృత్తిపట్ల అంకితభావం, సేవా దృక్పథంతో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆయన మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. పదోన్నతితో ఆయన బాధ్యతలు మరింత పెరిగాయని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మోహితే మారుతి, మండల అధికార ప్రతినిధి ఆడే జైపాల్, మైనార్టీ అధ్యక్షుడు సమీర్ ఖాన్, దరడే అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



## యువతకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోర వైఫల్యం..

- - నెలకు ₹4,000 నిరుద్యోగ భృతి ఏమైంది?
- - రెండు లక్షల ఉద్యోగాల భర్తీపై నిలదీత
- - భైంసాలో బీజేవైఎం ఆధ్వర్యంలో ఘనంగా నిరసన ప్రదర్శన

**నిర్మల్ జిల్లా అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

భైంసా రూరల్, తెలంగాణ ఎన్నికల సమయంలో యూత్ డిక్లరేషన్' పేరుతో నిరుద్యోగులను, యువతను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వారికి ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ఘోరంగా విఫలమైందని భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. యువతకు ఇచ్చిన వాగ్దానాల అమలులో ప్రభుత్వ ఉదాసీన వైఖరిని నిరసిస్తూ శనివారం భైంసా పట్టణంలోని రాజునగర్ దుర్గామాత మండపం ఎదుట బీజేవైఎం ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరసనకారులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. అనంతరం జరిగిన సభలో బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర నాయకులు కొండ సాయి ప్రసాద్ గౌడ్, బీజేవైఎం నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిందే గంగాప్రసాద్, ఓబీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హనుమాండ్లు సంయుక్తంగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు నెలకు ₹4,000 చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామని ఆశ చూపి, అధికార పీఠం ఎక్కిన తర్వాత ఆ ఊసే ఎత్తకపోవడం నిరుద్యోగ లోకాన్ని వంచించడమేనని వారు మండిపడ్డారు.

**యువతను నయవంచనకు గురిచేశారు**

మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని, ప్రతీ నిరుద్యోగ కుటుంబానికి అండగా ఉంటామని చెప్పిన మాటలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని నాయకులు విమర్శించారు. నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుకుంటోందని, నోటిఫికేషన్ల జారీలో మరియు పరీక్షల నిర్వహణలో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. అదేవిధంగా యువత స్వయం ఉపాధిని మెరుగుపరిచేందుకు ప్రకటించిన 'రాజీవ్ యువ వికాసం' పథకం ఎక్కడా అమలుకు నోచుకోలేదని, దీనివల్ల వేలాది మంది యువతీ యువకులు ఉపాధి అవకాశాలు కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్ళు తెరిపించేలా రాబోయే రోజుల్లో బీజేవైఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు, ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చే వరకు తాము విశ్రమించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం స్థానిక నియోజకవర్గ, పట్టణ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొని నిరసనకు మద్దతు పలికారు.



## భానురి వెంకట్రాంరెడ్డి కుటుంబాని పరామర్శించి పట్నం మహేందర్ రెడ్డి

**శంకర్ పల్లి అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం)**



శంకర్ పల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి సేవలు చిరాస్మరణీయం అని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సాయి కాలనీలో గల ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన మృతి స్థానికంగా తీరని లోటని మహేందర్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటే రెడ్డి పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాం

- ఎమ్మెల్యే కాలె యాదయ్య

**మొయినాబాద్, అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్ మండలం ఎత్మర్పల్లి గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ భవనం అందుబాటులోకి రావడంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందుతాయని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



## జాడిమల్కాపూర్ లో పింఛన్ల పరిశీలన చేపట్టిన జడ్పీ సీఈఓ జానకి రాంరెడ్డి

- ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకోవాలని సూచన.

**జహీరాబాద్ అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం**

)మొగుడం పల్లి మండలంలోని జాడిమల్కాపూర్ గ్రామంలో శనివారం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (జడ్పీ సీఈఓ) శ్రీ జానకి రాంరెడ్డి గారు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పింఛన్ లబ్ధిదారుల వివరాలను ర్యాండమ్ పద్ధతిలో పరిశీలించి, పింఛన్ల వెరిఫికేషన్ నిర్వహించారు. అనంతరం గ్రామంలో నీటి సంరక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతంలో అనిశ్చితి, నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతను తప్పనిసరిగా నిర్మించుకోవాలని, తద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మణియార్పల్లి గ్రామంలో ఒక లబ్ధిదారుడి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మాణానికి మార్కింగ్ చేసి, పనులను ప్రారంభించారు. గ్రామంలోని ప్రతి కుటుంబం నీటి సంరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ గ్రామ సర్పంచ్ బి రాజు ఉపసర్పంచ్ ఎజాస్ పటేల్ ఎం పి ఓ క్రిష్ణకుమార్ పంచాయతీ కార్యదర్శి అరుణా జ్యోతి వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు.. భక్తజన నీరాజనం!

- బండారు వారి వీధిలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఏడో రోజు విశేష పూజలు..
- లలితా సహస్రనామ పారాయణం
- సిరిసంపదలు, సుఖశాంతులు కలగాలని భక్తుల ప్రార్థనలు

**వనపర్తి, అక్టోబరు 17(ప్రజాక్షేత్రం):**

సిరిసంపదలు, సౌభాగ్యం, ఐశ్వర్యాన్ని ప్రసాదించే మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వడంతో బండారు వారి వీధి భక్తిభావంతో పులకించింది. వేదమంత్రాలు, భక్తుల ప్రార్థనలు, ప్రత్యేక పూజల నడుమ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం వైభవంగా కొనసాగాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలిరావడంతో వీధిలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. వనపర్తి జిల్లా కేంద్రంలోని బండారు వారి వీధిలో మున్నూరు కాపు సంఘం, మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు అమ్మవారిని శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మీదేవి రూపంలో సర్వాంగసుందరంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజల జీవితాల్లో సిరిసంపదలు, సౌభాగ్యం వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు.

**భక్తిశ్రద్ధలతో విశేష పూజలు**

పురోహితుల ఆధ్వర్యంలో అష్టోత్తర శత నామావళి, గురుకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్రాంత పంచాయతీరాజ్ ఉప ఇంజినీర్ బండారు శ్రీనివాసులు, లక్ష్మీ ప్రసన్న దంపతులతో పాటు బండారు యాదమ్మ, శ్రీనివాసులు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సారె సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

**ఐశ్వర్య ప్రదాయినిగా మహాలక్ష్మి**

హిందూ సంప్రదాయంలో మహాలక్ష్మీదేవిని సంపద, ధాన్యం, ఐశ్వర్యం, సౌభాగ్యాలకు ప్రతీకగా ఆరాధిస్తారు. కుటుంబాల్లో శాంతిసౌఖ్యాలు వెల్లివిరియాలని, వ్యాపారాలు, వృత్తులు అభివృద్ధి చెందాలని, ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నిండాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజించడం ప్రత్యేకతగా నిలుస్తోంది. ఏడో రోజు మహాలక్ష్మి రూపంలో అమ్మవారి దర్శనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

**వారం రోజులుగా అన్నదాన సేవలు**

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలకూ ఉత్సవ నిర్వాహకులు ప్రాధాన్యమిస్తున్నారు. ఉత్సవాలు ప్రారంభమైనప్పటి నుంచి వరుసగా వారం రోజులుగా ప్రతిరోజూ భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేపడుతున్నారు. మున్నూరు కాపు మహిళా సంఘం సభ్యులు, సంఘ పెద్దలు సమష్టిగా సేవలందిస్తూ అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. పూజలు, పారాయణాలు, అన్నప్రసాద వితరణతో బండారు వారి వీధిలో శరన్నవరాత్రి వేడుకలు భక్తి వైభవాన్ని చాటుతున్నాయి. సంఘ సభ్యుల సమన్వయం, భక్తుల భాగస్వామ్యంతో ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.



# హైదరాబాద్‌కు వెళ్లే అవసరం లేదు.. నిజామాబాద్‌లోనే ఆధార్ సేవలు!

- నూతన ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్, ప్రజాక్షేత్రం:**

ఆధార్ సేవల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా నిజామాబాద్‌లోనే వివిధ సేవలు పొందే అవకాశం కలిగిందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. నిజామాబాద్ నగరంలోని వర్ని రోడ్డులో కోటగల్లిలోని మున్నూరు కాపు సంఘం భవనంలో భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని శనివారం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆధార్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, వివిధ సేవలను సులభంగా, పారదర్శకంగా అందించేందుకు రాష్ట్రంలోని పది ప్రాంతాల్లో కొత్తగా ఆధార్ సేవా కేంద్రాలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. దీంతో ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే ఆధార్ సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కేంద్రంలో కొత్త ఆధార్ నమోదు, ఆధార్ కార్డులో వివరాల సవరణ, చిరునామా మార్పు, పేరు, పుట్టిన తేదీ తదితర వివరాల్లో నిబంధనల మేరకు మార్పులు చేసుకునే అవకాశం ఉందన్నారు. సేవల కోసం వచ్చే వారు సంబంధిత గుర్తింపు, చిరునామా, జనన తేదీ ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. యూఐడీఏఐ నిర్ణయించిన రుసుములనే చెల్లించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకింగ్ తదితర సేవలకు ఆధార్ వివరాలు అవసరమవుతున్న నేపథ్యంలో, ప్రజలు తమ ఆధార్ సమాచారాన్ని సక్రమంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. నగర ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల వారు కూడా ఈ కేంద్రం ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆధార్ ప్రాధికార సంస్థ హైదరాబాద్ ప్రాంతీయ అధికారి శ్రవణ్, ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తీక్ కుమార్, ఆధార్ సేవా కేంద్రం ఆపరేషనల్ మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.








# సర్పంచ్ దశరథ్‌కు అండగా దళిత బహుజన దండోరా!

- ప్రజల మద్దతుతో ఎదిగిన నాయకుడికి అండగా నిలుస్తాం

**నిర్మల్ జిల్లా అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

కుంటాల కల్లూరు, తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఉద్యమకారుడు, విద్యార్థి నాయకుడు, గత పదేళ్లుగా ప్రజాక్షేత్రంలో ఉంటూ సామాజిక సేవ చేస్తున్న కల్లూరు సర్పంచ్ పెంటవార్ దశరథ్‌కు అండగా నిలుస్తామని దళిత బహుజన నాయకులు స్పష్టం చేశారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న నాయకుడిపై నిరాధార ఆరోపణలు చేస్తూ ఇబ్బందులకు గురి చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రజాప్రతినిధి అధికారాలను హరించే చర్యలు చేపట్టినప్పుడు, వాటి వెనుక ఉన్న కారణాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు.

**ప్రజల ఆశీర్వాదంతో చారిత్రక విజయం..**

కల్లూరు గ్రామపంచాయతీ ఎన్నికల్లో పెంటవార్ దశరథ్‌కు ప్రజలు భారీ మెజారిటీతో విజయాన్ని అందించారని నాయకులు గుర్తుచేశారు. గ్రామ ప్రజల విశ్వాసాన్ని పొందిన ఆయన ప్రజల మనిషిగా గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన అనుభవంతో పాటు, విద్యార్థి నాయకుడిగా ప్రజా సమస్యలపై పోరాడిన నేపథ్యం ఆయనకు ఉందన్నారు. గత పదేళ్లుగా ప్రజాక్షేత్రంలో కొనసాగుతూ సమాజ సేవకు ప్రాధాన్యమిస్తున్న నాయకుడిపై రాజకీయ కక్షతో వ్యవహరిస్తున్నారనే అనుమానాలు కలగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. న్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఆ తీర్పును గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్ గ్రామాభివృద్ధి కోసం పని చేసేలా సహకరించాల్సింది పోయి, ఆయన విధులకు ఆటంకాలు ఎదురవుతున్నాయనే ఆరోపణలు రావడం సరైన పరిణామం కాదన్నారు.

**చెక్ పవర్ రద్దుపై స్పష్టత ఇవ్వాలి**

సర్పంచ్ దశరథ్‌పై లేని ఆరోపణలు సృష్టించి, అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఆయన చెక్ పవర్ రద్దు చేయించినట్లు వస్తున్న ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరపాలని దళిత బహుజన నాయకులు డిమాండ్ చేశారు. చెక్ పవర్ రద్దుకు దారితీసిన కారణాలు ఏమిటి? అందుకు సంబంధించిన ఆధారాలేమిటి? నిబంధనల ప్రకారమే నిర్ణయం తీసుకున్నారా? అనే అంశాలను స్పష్టంగా వెల్లడించాలని కోరారు.

ఒక ప్రజాప్రతినిధిపై ఆరోపణలు వచ్చినంత మాత్రాన ఆయనను దోషిగా భావించడం తగదని, అదే సమయంలో ఆరోపణలను పక్కన పెట్టకుండా నిబంధనల ప్రకారం విచారణ జరపాలని సూచించారు. ఏ నిర్ణయం తీసుకున్నా అది చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉండాలని, వ్యక్తిగత కక్షలకు తావులేకుండా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు.

**ఒకరికి ఒక న్యాయం.. మరొకరికి మరో న్యాయమా?**

ఇతర గ్రామాల సర్పంచులకు ఒక విధంగా, కల్లూరు సర్పంచ్ దశరథ్‌కు మరో విధంగా వ్యవహరిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా చూడాలని నాయకులు పేర్కొన్నారు. ఒకే విధమైన పరిస్థితుల్లో ఉన్న ప్రజాప్రతినిధులందరికీ ఒకే విధమైన నిబంధనలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని, అధికారుల నిర్ణయాల్లోనూ ఆ సమానత్వం కనిపించాలని స్పష్టం చేశారు. ప్రజలు ఎన్నుకున్న నాయకుడిని రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధి పనులు చేసుకునేలా చూడాలని, ఏవైనా అవకతవకలు జరిగినట్లు ఆధారాలుంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. అయితే, ఆరోపణల పేరుతో ఒక ప్రజాప్రతినిధి గౌరవానికి భంగం కలిగించడం, ఆయన విధులకు ఆటంకం కలిగించడం సమంజసం కాదని పేర్కొన్నారు.

**విత్తనాన్ని తొక్కితే మొలకెత్తకుండా ఆపలేరు**

విత్తనాన్ని ఎంతగా తొక్కాలని ప్రయత్నించినా, అనుకూల పరిస్థితులు లభిస్తే అది మొలకెత్తి ఎదుగుతుందని నాయకులు వ్యాఖ్యానించారు. ప్రజల విశ్వాసంతో ఎదిగిన నాయకుడిని ఇబ్బందులకు గురిచేసినంత మాత్రాన ప్రజల మద్దతును దూరం చేయలేరని అన్నారు. దశరథ్‌పై అన్యాయం జరిగిందని భావిస్తే, ఆయనకు అండగా నిలబడి ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ గళాన్ని వినిపిస్తామని స్పష్టం చేశారు.

ఒక వ్యక్తికి సంబంధించిన అంశంగా మాత్రమే ఈ వ్యవహారాన్ని చూడకూడదని, ప్రజాప్రతినిధుల హక్కులు, గ్రామాల అభివృద్ధి, అధికారుల బాధ్యతాయుతమైన వ్యవహారశైలికి సంబంధించిన అంశంగా పరిగణించాలని కోరారు. ప్రజల తరఫున పనిచేసే నాయకులకు నిబంధనల ప్రకారం విధులు నిర్వహించే అవకాశం కల్పించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమని పేర్కొన్నారు.

**ముధోల్ గడ్డపై దళిత బహుజన ఐక్యతను చాటుతాం..**

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని నాయకులు పిలుపునిచ్చారు. తమ సమస్యలపై ప్రశ్నించినప్పుడు ఒక్కొక్కరిని ఒంటరిగా చూడకుండా, పరస్పరం అండగా నిలబడి న్యాయం కోసం పోరాడాలని అన్నారు. దళిత, బహుజన వర్గాల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం కార్యాచరణను ముందుకు తీసుకెళ్తామని ప్రకటించారు.

ముధోల్ ప్రాంతంలో అణగారిన వర్గాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రజాస్వామ్యబద్ధమైన మార్గాల్లో వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజల హక్కులకు భంగం కలిగినప్పుడు ప్రశ్నించడం తమ బాధ్యతగా భావిస్తామని, న్యాయం జరిగే వరకు శాంతియుతంగా, ఐక్యంగా తమ గళాన్ని వినిపిస్తామని పేర్కొన్నారు.







# పెద్దేముల్ సొసైటీ అభివృద్ధికి ఎన్ని కోట్లయినా తీసుకొస్తా!

- రైతుల సంక్షేమమే లక్ష్యంగా సొసైటీని బలోపేతం చేస్తా
- రెండు నెలల్లో పీఏసీఎస్‌లో విలీనం.. ఆరు నెలల్లో డీసీసీబీ బ్యాంకు ఏర్పాటు
- గోల్డ్ లోన్లతో పాటు అన్ని రకాల రుణాలు అందేలా చర్యలు
- పెద్దేముల్ సొసైటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**పెద్దేముల్, అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

పెద్దేముల్ సొసైటీకి ఎన్ని కోట్ల రూపాయలు అయినా ఇప్పించి రైతుల మేలు కోసం సొసైటీ అభివృద్ధికి సహకరిస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో సొసైటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారంలో ముఖ్య అతిథిగా పాల్గొని పాలక వర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ...తాను డీసీసీబీ ఛైర్మన్ గా ఉన్నపుడు సొసైటీలను డీసీసీబీలో అనుసంధానం చేయించి సొసైటీలను కంప్యూటరైజెడ్ చేయించి రూ. 600 కోట్ల టోర్నవర్ ను 2,400 కోట్ల వరకు పెంచామని అన్నారు.సీఈఓలకు ఉద్యోగభద్రత కల్పించి, సొసైటీల ద్వారా ప్రతి రైతుకు 2,3 రోజుల్లో లోన్లు వచ్చేలా చేశామన్నారు. పెద్దేముల్ సొసైటీని 1,2 నెలల్లో పీఏసీఎస్ లో కలిపి డీసీసీబీకి అనుసంధానిస్తామని అన్నారు.6 నెలల్లో మండల కేంద్రంలో డీసీసీబీ బ్యాంకును ఏర్పాటు చేసి వారం రోజుల్లో ఎల్టీ లోన్లు,విదేశాల్లో మన పిల్లలు ఉన్నత చదువులు చదవడానికి రుణాలను ఇప్పిస్తామని అన్నారు. దేశమంతటా రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం ఉన్నందున అందరం కలిసికట్టుగా కరోనాను అడ్డుకున్నట్లు ఎల్ నినోను అడ్డుకోవాలని అన్నారు.10 సంవత్సరాలు బీఆర్ఎస్ నాయకులు ఏమి చేశారని, 10 సంవత్సరాలు తాండూరులో జంగిల్ రాజ్ వ్యవస్థను ఏర్పాటు చేశారని,గడిచిన ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్కు ప్రజలు గుండు సున్నా ఇచ్చారని, ఇంకా పగటి కలలు కనవద్దని అన్నారు. తాండూరు నియోజకవర్గంలో సుమారు 106 గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగిరిందని,తెలంగాణలోనే అత్యంత పెద్ద గ్రామం కరణ్ కోట్ గ్రామంను ఏకగ్రీవం చేయడం జరిగిందన్నారు.బీఆర్ఎస్ పార్టీ సన్నాసులకు బుద్ధి, సోయి ఏమైనా ఉందా?లేదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ జంగిల్ రాజ్ సన్యాసులు ఇకనైనా పద్ధతి మార్చుకొని పద్ధతిగా మాట్లాడాలని అన్నారు. కాంగ్రెస్ అంటే ఉత్తుత్తి మాటలు మాట్లాడే జంగిల్ రాజ్ వ్యవస్థ కాదని, తాండూరు కాగ్నా నీళ్లు తెచ్చింది కాంగ్రెస్ అని అన్నారు. కాంగ్రెస్ వచ్చాక పెద్దేముల్ మండలంలో 340 కోట్ల రైతు భరోసాను రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు.నిరుపేదలకు కాంగ్రెస్ హయాంలో రేషన్ కార్డులు, సన్నబియ్యం ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని, ప్రస్తుతం ఇందిరమ్మ ఇల్లులేని గ్రామం లేదని తాండూర్ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని అన్నారు.5 సంవత్సరాలలో బీఆర్ఎస్ నాయకులు జంగల్ రాజ్ వ్యవస్థను ఏర్పాటు చేసి పూర్తిగా నాశనం చేశారని అన్నారు. పెద్దేముల్ సొసైటీ నూతన ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పాలకవర్గ సభ్యులు అనుక్షణం రైతుల పక్షాన ఉండి రైతులను మేలు కోరుతూ రైతుల కోసం పాటుపడుతూ జిల్లాలోనే మంచి సొసైటీగా పేరు ప్రతిష్టలు వచ్చేలా చూడాలని అన్నారు. పెద్దముల్ సొసైటీకి ఎన్ని కోట్ల రూపాయలైనా తాను ఇప్పిస్తానని లాకర్లు గోదాములు ఏర్పాటు చేసుకోవాలని గోల్డ్ లోన్లతో పాటు పెద్దేముల్ సొసైటీ పరిధిలో రైతులకు అన్ని రకాల లోన్లు వచ్చేలా తాను బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు.

**సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా.. రైతులకు మెరుగైన సేవలందిస్తా**

**పెద్దేముల్ సొసైటీ ఛైర్మన్ నల్లా యెల్లారెడ్డి**

పెద్దేముల్ సొసైటీ నూతన ఛైర్మన్ నల్లా ఎల్లారెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో తనకు సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని,సొసైటీ పరిధిలోని ప్రతి రైతుకు మెరుగైన సేవలు అందించేందుకు పాలకవర్గ సభ్యులతో కలిసి కృషి చేస్తానని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన రుణాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటూ, సొసైటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహకారంతో సొసైటీని మరింత బలోపేతం చేసి, రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని తెలిపారు. రైతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, పెద్దేముల్ సొసైటీని జిల్లాలోనే ఆదర్శ సహకార సంఘంగా తీర్చిదిద్దేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని ఛైర్మన్ నల్లా ఎల్లారెడ్డి స్పష్టం చేశారు. అనంతరం పలువురు సొసైటీ పాలకమండలి సభ్యులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు జాదవ్ ధారసింగ్ నాయక్,తట్టేపల్లి సొసైటీ ఛైర్మన్ పి.మహిపాల్ రెడ్డి,వైస్ ఛైర్మన్ జగన్,పెద్దేముల్ సొసైటీ వైస్ ఛైర్మెన్ బొంకూర్ శ్రీనివాస్, కోట్ పల్లి ఏఎంసీ చైర్ పర్సన్ అనితారమేష్ నాయక్, వైస్ చైర్ పర్సన్ మధులత శ్రీనివాస్ చారి, డీఎల్డీఏ మాజీ ఛైర్మన్ నారాయణ రెడ్డి,తాండూరు నియోజకవర్గ సర్ కన్వీనర్ కరణం పురుషోత్తం రావు,సర్దార్ ఖాన్,కే. శోభారాణి,సీనియర్ నాయకులు ఉత్తమ్ చంద్, ఉప్పరి మల్లేశం, లొంక నర్సింహులు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నారాయణ గౌడ్, సొసైటీ డైరెక్టర్లు,తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్,కోట్ పల్లి ఏఎంసీ మాజీ ఛైర్మెన్ లు అంజయ్య, బుజ్జమ్మ, కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు మహేష్, గ్రామ పెద్దలు నరేందర్ రెడ్డి దొర,నల్లా నర్సి రెడ్డి, పెండ్యాల ప్రవీణ్ కుమార్ గుప్తా,జాదవ్ రాము నాయక్,విద్యాసాగర్, కోహిర్ రవి శంకర్,కోహిర్ గోపాల కృష్ణ,చిట్టెపు రాఘవేందర్ రెడ్డి,డి వై. నర్సింహులు, ఆనందం చారి,సొసైటీ సిబ్బంది మురళీ, పెంటప్ప, ఫయాజ్, ప్రవీణ్ కుమార్, మానెప్ప,ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,పార్టీ శ్రేణులు,యువ నాయకులు, పెద్దేముల్ గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# టాక్లి గ్రామంలో వైభవంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు

**నిజామాబాద్ జిల్లా ప్రజాక్షేత్రం:**

పోతంగల్ మండల పరిధిలోని టాక్లి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం అందిస్తున్న ఈ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయడానికి గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ విశేష కార్యక్రమానికి పోతంగల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) చందర్ నాయక్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీడీవో చందర్ నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత పెరుగుతుందని, లబ్ధిదారులకు సరుకుల సరఫరా సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మగరే పద్మావతి సాయికిరణ్ ఉపసర్పంచ్ సురేఖ జ్యోతి పాల్ గ్రామపంచాయతీ కార్యదర్శి రాము జీపీఓ శ్రీకాంత్

వీరితో పాటు వార్డు సభ్యులు చిక్లె దేవిదాస్, గ్రామ పెద్దలైన సంజయ్, శివాజీ, శ్రీనివాస్, రాజేశ్వర్, రమేష్, వెంకట్రావు తదితరులు పాల్గొని లబ్ధిదారులకు చేతుల మీదుగా కార్డులను అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తమకు స్మార్ట్ రేషన్ కార్డులు అందడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, అధికారులకు మరియు ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394